ఆడ పులి

కంచర్ల రమణ

డొంకిరి మెట్ట!

రెండు కొండల పాదాలు కలిసిన వంపులో ఉన్న కొండపల్లె అది! సుంకర మెట్టకు పదిహేను మైళ్ళు, అనంత గిరికి పాతిక మైళ్ళ దూరంలో తూర్పుకనుమల్లో ఉందది!

ఊరంతా కలిసి వంద ఇళ్ళు ఉండవు. ఆ వూరి జనాభా యేనాడూ వెయ్యి దాటలేదు.

కొందరు సేద్యంమీద బ్రతికితే, మరికొందరు, ఆవుల్ని, మేకల్ని, గేదెల్ని పెంచి, బ్రతుకుతూ ఉంటారు.

డొంకరిమెట్ట ప్రజలకు కావాల్సిన నిత్యావసర వస్తువులు ఆ వూళ్ళో దొరకవు. అటు సుంకర మెట్ట సంతకో, ఇటు, అనంతగిరిలో వెలసిన యే కిరాణాకొట్టుకో పోయి తెచ్చు

కోవాల్సిందే.

ఆ ఊరికి దగ్గరలో ఉన్నది, సుంకరమెట్టే కాబట్టి, తమకు కావాల్సిన సామాను, వారానికి సరిపడేగా, విధిగా సుంకరమెట్ట సంతనుంచి తెచ్చుకుంటారు.

డొంకిరిమెట్ట ప్రజలు డబ్బు చూడ్డం అన్నది చాలా అరుదు. కర్రలు కొట్టి, మోపులు కట్టి, సంతకు మోసుకుపోయి, దానికి బదులు తమకు కావాల్సిన నూనె, ఉప్పూ వగైరా సంబారాలు తెచ్చుకుంటారు. సీజనులో చింతపండు, కుంకుడుకాయలు, పసుపు, ఆవాలు, పాలపిండి వగైరా అటవీఫలసాయం తీసుకెళ్ళి అమ్మి సామాను కొనుక్కురావడం కద్దు.

ఆ వూరికి ఓ నాయకుడున్నాడు. అతడిపేరు భీందొర. భీందొరకు అరవై యేళ్ళుంటాయి. సుమారుగా అయిదడుగుల ఆరంగుళాల పొడవుంటాడు. నల్లగా, బలిష్ఠంగా, కండలు దిరిగిన శరీరమైనా, వార్ధక్యం ముంచుకురావడంవల్ల, అతడి కండల బిగి తగ్గి, దారుఢ్యం కాస్త సడిలింది. పెద్ద కళ్ళు, బుర్రమీసాలు. తెల్లని వూలు బంతులు ఉంచినట్టుగా ఆ మీసాలు అవుపిస్తాయి బుగ్గలమీద. జానెడు గుడ్డ పైకి పింఛంలా వదిలిపెట్టి, అయిదు గజాల పంచెతో తలపాగ చుట్టాడంటే, రాజఠీవి ఉట్టిపడుతుంది అతనిలో.

అవాళ, బారెడు పొద్దెక్కాక, అతని ఇంటిముందు, ఇంచు మించు ఆ వూరి జనమంతా - పిల్లా మేకాతో సహా - గుమిగూడి ఉన్నారు.

ఇంటిముందర అరుగుమీద భీందొర కూచున్నాడు. అతని ఒడిలో తలపెట్టి ఓ పదహారేళ్ళ యువకుడు ఏక బిగిని యేడుస్తున్నాడు.

అతడిని ఓదార్చుతూ, భీందొర చెయ్యి, కుర్రాడి తల మీద ఉంది.

"తాతా!... మా మామ్మను నాకు తెచ్చిపెట్టు తాతా!... మామ్మ లేకపోతే నేను బతకను తాతా... తెచ్చిపెట్టు తాతా... లేకపోతే... ఆ పులికి నన్ను బలి ఇచ్చే తాతా" ఆ యువకుడి రోదనకు అంతులేదు.

భీందొర, అతడి తలని నిమిరి ఓదార్చగలగడం తప్ప, ఇంకేమీ చెయ్యగలిగే స్థితిలో లేడు.

ఎప్పటిదో, ఇక్ష్వాకుల కాలంనాటిదైనా, భీందొర ఇంట్లో ఓ తుపాకీ ఉంది. దాన్ని భీందొర ఉపయోగించి పదిహేనేళ్ళు కావస్తోంది.

వేటాడ్డం, ఆ కొండ నాయకుడికి కొత్తగాదు. తప్పూ అంతకన్నా కాదు. పైగా సరదా కూడాను.

అయితే ఓ రోజున ఓ ఆడలేడిని కొట్టాడు. ఇంటికొచ్చి, ఆ లేడిని కోసి చూసేసరికి, దాని కడుపులో పిండం అవుపించింది. అది కడుపుతో ఉందన్న సంగతి, భీందొర మనస్సుని కాస్త కించపరచినా, పిండాన్ని పారేసి, లేడి మాంసం యధావిధిగా వండించు తిన్నాడు.

భీందొర పెళ్ళాం కడుపుతో ఉంది. అప్పటికి ఇద్దరు పిల్లలు పుట్టి, ఆరోగ్యంగా బ్రతుకుతున్నారు కూడాను. మొదటివాడికి పదేళ్ళు నిండాయి.

లేడిని వేటాడిన మరుసటి రోజునుంచి, భీందొర జీవితంలో ఒకటి తర్వాత ఒకటి ఎన్నో దుర్ఘటనలు జరిగాయి. ఇంకో నెల తర్వాతగాని ప్రసవం కాదనుకున్న భార్యకు హఠాత్తుగా పురిటి నొప్పులు వచ్చి, ఆమె ప్రాణంలేని ఓ మాంసఖండాన్ని కని చనిపోయింది.

వారంరోజులు ఆ తర్వాత గడవకుండానే, ఆటకోసం బయటకెళ్ళిన ఇద్దరు పిల్లల్ని ఓ యెద్దు కొమ్ములతో కుమ్మి చంపేసింది.

జీలుగు కల్లో, ఇప్పసారాయో మస్తుగా పట్టించేసి, రాత్రుళ్ళు వీధి మధ్యలో పెట్టే చలి మంట ముందు కూచుని, తన కమ్మని కంఠం యెత్తి పాటలు పాడేవాడు భీందొర.

అలాంటిది, నెలరోజుల వ్యవధిలో, తన భార్యా, ఇద్దరు పిల్లలూ హఠాత్తుగా చనిపోయేసరికి, అతని గొంతు మూగబోయింది.

కొండ దొరలు ఎంతమంది ఆడవాళ్ళనైనా ఒకేసారి పెళ్ళాడవచ్చు. కాని, భీందొర, ఒకరిని మించి పెళ్ళాడనని వ్రతం పూనాడు. అయితే, గ్రామనాయకత్వం మాటేమిటి? తన వంశం సంగతేమిటి?

భీందొర ఇంకో పెళ్ళిచేసుకోక తప్పలేదు. కాని, మూడేళ్ళు గడిచినా ఆమెకు బిడ్డా, పాపా కలగలేదు. ఇంకో ఆమెను చేసుకొన్నాడు. ఆమె సంగతి కూడా అంతే!... తనతో తన వంశం అంతరించి పోతుందన్న భయం పట్టుకుంది భీందొరని.

ఈసారి, ఆ పిల్ల వంశంలో గొడ్రాళ్ళు యెవరూ లేరని నిర్ధారించుకున్నాక గాని, సింగి అనే చక్కని చుక్కను పెళ్ళాడలేదు.

అయితే, సింగికి కూడా సంతానంలేదు. ఆమెకు ఇప్పుడు మున్ఫైయేళ్ళు. ఏపుగా, గుబురుగా, బలంగా, పచ్చని కొమ్మలు పెంచుకొన్న కొండ మామిడి చెట్టులా సింగి యెదిగింది కాని, ఆమె కడుపు పండలేదు.

ఆ ఆడలేడిని చంపిన పాపంవల్ల, తనింక నిర్వంశంగా చనిపోవాల్సిందే అన్న వైరాగ్యంతో బ్రతుకీడుస్తున్నాడు భీందొర.

ఈ రోజున ఈ సమస్య వచ్చి పడింది. భీందొర మనస్సంతా అల్లకల్లోలంగా ఉంది.

ఆ కుర్రాడి పేరు ధోరమ్. ముందు రోజు ఉదయం వరకూ ఆ కుర్రాడికో మామ్మ ఉండేది. ఆ మామ్మకు ఆ కుర్రాడు, ఆ కుర్రాడికి ఆ మామ్మ తప్ప, యీ లోకంలో వాడికింకెవరూ లేరు.

డొంకిరిమెట్ట గ్రామాన్నానుకుని ఉన్న అడవుల్లో చాలా పులులున్నాయి. ఈ మధ్యనే ఓ పులి పశువుల్ని యెత్తుకుపోవడం మొదలు పెట్టింది. దాన్నెలాగైనా చంపెయ్యాలని ఆ వూరివాళ్ళు అనుకున్నారుగాని, యెలా చంపాలో వారికి తెలీలేదు. అడవి పందుల్నీ, లేళ్ళనీ, బాణాల్తో కొట్టి చంపుతారు. అలాగే పులుల్ని కూడా కొట్టడం అంటే మాటలు కాదు. గాయపడి, రెచ్చగొట్టబడ్డ పులంత ప్రమాదకరమైందేదీలేదు అడవి జంతువుల్లో. కనిపించిన ప్రతి మనిషిని కరచి చంపినా, గ్రామాలమీద బడి, దారుణంగా, పట్టపగలే దొరికినవాడ్ని దొరికినట్టే ఎత్తుకుపోయినా ఆశ్చర్యపోనక్కరలేదు.

దెబ్బ తిన్న వెంటనే జంతువు చనిపోవడం ఒక్క తుపాకీవల్లనే సాధ్యం. ఆ తుపాకీ భీందొరవద్ద ఉంది. భీందొర తుపాకీ ముట్టనంటూ భీష్మించుకు కూచున్నాడు.

తమ జీవనాధారమైన పశువుల్ని యెత్తుకుపోతుంటే, యెలాగో సహిస్తూ ఊరుకున్నారు ప్రజలు. సుమారు నెల రోజులయింది. ఆ పులి మనుషుల్ని ఎత్తుకుపోవడం ఆరంభించింది.

ధోరమ్ మామ్మ అలా పులి యెత్తుకుపోయిన మనుషుల్లో మూడవది.

ఆ రోజు ధోరమ్ అనంతగిరి వెళ్ళాడు ఏదో పనిమీద. ఈ లోపున వంటకు కావాల్సిన పుల్లలు ఇంట్లో నిండుకున్నాయి. ధోరమ్ మామ్మ ఇంకొకర్ని బరులు అడిగే రకం కాదు.

తలుపులు దగ్గరగా వేసి, కత్తి పుచ్చుకుని, అడవిలోకి వెళ్ళింది, ఎండు కర్రలు కొట్టి తేవడానికి.

అంతే! ఆమె మరి తిరిగిరాలేదు.

సాయంకాలం అవుతుండగా, ధోరమ్ అనంతగిరినుండి తిరిగి వచ్చాడు. తన మామ్మ ఇంటిదగ్గర లేదు. ధోరమ్ కడుపులో పేగులు చుట్టుకుపోతున్నాయి ఆకలితో. ఇంట్లో చూస్తే వంట అయినట్లు గుర్తులేదు. ఊరంతా తిరిగి, మామ్మ గురించి వాకబు చేసాడు.

అడవి కెళ్ళినట్టుగా చెప్పారుగాని, తిరిగివస్తే చూసినట్టుగా ఎవరూ చెప్పలేదు.

ముసలిది, చూపు ఆనక, అడవిలో దారి తప్పినట్టుంది. తెల్లారితే, తప్పక వస్తుంది అన్న ఆశతో రాత్రంతా గడిపాడు ధోరమ్.

తూర్పు తెల్లారినా, మామ్మ రాకపోయేసరికి, ఊర్లోని నలుగుర్ని పోగేసుకుని, అడవిలోకి పోయి వెదికాడు ధోరమ్.

అణిగిపోయిన మొక్కలు, గడ్డి దుబ్బుల్నిబట్టి, త్రోవలో కారి ఉన్న రక్తపు ముద్దల్నిబట్టి, అక్కడక్కడ దొరికిన చీర పీలికల్నిబట్టి, తన మామ్మకు యేంజరిగిందో, తెలిసింది ధోరమ్‌కు.

డొంకిరిమెట్ట వంటి కొండపల్లెల్లో, ధొరమ్‌వంటి దిక్కు-లేని వాళ్ళకు ఆ వూరి నాయకుడే దిక్కు.

అందుకే భీందొర కాళ్ళమీద పడి, తన మామ్మను తనకు తెచ్చిపెట్టమని, గుండెలు పగిలేలా ఏడుస్తున్నాడు.

2

గంటయింది. రెండు గంటలయింది. ధొరమ్ యేడుపు మానలేదు. భీందొర ఎన్ని సానుభూతి వాక్యాలు పలికినా, ధొరమ్ దుఃఖం ఉపశమించలేదు.

“బాబూ! ధొరమ్!... ఇలా యేడ్డంవల్ల లాభంలేదు. చెప్పు! నానుంచి నీకేం సాయంకావాలో చెప్పు. నా చేతనయినంత వరకూ చేస్తాను” అన్నాడు భీందొర, ఏడ్చి, ఏడ్చి, మరి యేడవడానికి గొంతుక లేవక, మూగవాడిలా వెక్కి వెక్కి దుఃఖిస్తున్న ధొరమ్ ముహం, తన రెండు చేతుల్తో పైకెత్తి.

“నేను బ్రతకను తాతా!... మామ్మలేకుండా ఎలా బ్రతగ్గలను?... నువ్వే చెప్పు?” అన్నాడు, ధొరమ్, దుఃఖంతో పూడ్చుకుపోయినగొంతుక ఎలాగో పెగుల్చుకుని.

“చచ్చిపోయిన వాళ్ళతో మనమూ చచ్చిపోలేం గద? నువ్వు బ్రతికాలి... చెప్పు... నీకేం సాయం చెయ్యగలనో చెప్పు?”

“నాకేం పెద్ద కోరికలులేవు తాతా! మామ్మను పొట్టబెట్టుకొన్న ఆ పులిని చంపి, నా మండే గుండెలు శాంతింపజెయ్యి” ఆవేశంగా అన్నాడు ధొరమ్.

“లేదు బాబూ! నే నా పని చెయ్యలేను. నీకు తెలియందేముంది?” తన అశక్తతను తెలియజేశాడు భీందొర.

“ఏమిటిది తాతా! నోరులేని జీవాల్ని చంపితే తప్పు

గాని, మన పశువుల్ని, మనుషుల్ని తినేసే పులిని చంపడం దోషం కాదు.''

ఆ మాటలు వినగానే, భీందొర గుండెల్లో ములుకు గుచ్చుకొన్నట్టయింది!

అవును! నిజమే! ధొరమ్ చెప్పింది సబబే! అయినా, తను ఆ కడుపుతో ఉన్న లేడిని చంపిన దగ్గర్నుండి ఏవేవో ఘటనలు జరగటంతో, కొండ దేవతమీద ప్రమాణం చేశాడు, జీవితంలో ఇంకెప్పుడూ తుపాకీ పట్టనని.

''లేదు బాబూ! ఆ పులి నా ఇంటికొచ్చి నన్నెత్తుకు పోయినా, నేను తుపాకీ ముట్టను'' అన్నాడు భీందొర, విచారంగా తలొంచుకొని.

''అయితే, ఈ వూరి నాయకుడివై యుండి, ఈ వూరి మనుషుల్ని ఒకరి తరువాత ఒకర్ని బలి తీసుకుంటుంటే, చూస్తూ కూచుంటావా?'' ధొరమ్ రోషంగానే, ఎత్తి పొడుస్తున్నట్టుగానే అన్నాడు.

అతడి మాటల్ని, అక్కడ గుమిగూడిన జనంలోని కొంతమంది వెంటనే సమర్థించారు.

భీందొర ఇరకాటంలో పడ్డాడు. తను జీవితంలో మరి తుపాకీ పట్టనని వ్రతంపూనాడు. ఇంకో ప్రక్క, మనుషుల్ని చంపి, యెత్తుకుపోయే పులి బారినుండి తన గ్రామస్తుల్ని రక్షించే బాధ్యత తనమీదుంది. ఏం చెయ్యడం? నిదానంగా ఆలోచించాడు ఓ క్షణం.

ఇటు తన వ్రతానికీ, అటు తన బాధ్యతకూ భంగం కలగకుండా ఉండాలంటే, మధ్యే మార్గం ఒకటే! తను పోయి, ఓ షికారీని తెచ్చి పులిని చంపించడం.

"చూడండి!" క్షణం మౌనం తర్వాత అన్నాడు భీందొర. జనం ఊపిరి బిగబట్టి, నిశ్శబ్దంగా వినసాగారు. "మీకు కావాల్సింది, ఆ పులి నాశనం కావడం. అంతే గదా?"

"అంతే!" అన్నట్టుగా తలూపారు, ధొరమ్‌తో పాటుగా అక్కడున్న జనమంతా.

"ఆ బాధ్యత నాకొదిలెయ్యండి. వారం రోజుల్లో దాన్ని చంపిచేస్తాను" అన్నాడు భీందొర నిశ్చయంగా.

భీందొర మాట యిచ్చాడంటే, తప్పదని, ఆ వూరి ప్రజలకు తెలుసు. అతని మాటలతో తృప్తిపడ్డారు వాళ్లు.

3

"బాబూ! కలెక్టరుగారున్నారా లోపల?" అడిగాడు భీందొర, గేటు దగ్గరున్న దర్వానుతో.

నడుం మీద నీర్కావి పంచె, తలకు ఎర్రటి తలపాగా చేతిమీద, మెడలోనూ తాయెత్తులూ, వేరులుకట్టిన త్రాళ్లు, వెండి తీగలతో తయారుచేసి తగిలించుకున్నట్టుగా ఉన్న బుర్ర మీసాలతో, నల్లగా ఉన్నా, దర్జాగా, హుందాగా ఉన్న భీం దొరను చూడగానే, దర్వానుకు కాస్తంత గౌరవం మనసులో మెదిలినా, తన మామ్మూలు ధోరణిలో "ఉన్నారు గాని, వారిని యిప్పుడు ఎవరూ చూడ్డానికి వీల్లేదు" అన్నాడు, కసురుకుంటూ.

అదేసమయంలో లోపలినుంచి ఓ పదెనిమిదేళ్ల యువకుడు గేటు దగ్గర కొచ్చి "ఆగు దర్వాను ఎందుకా కేకలు?" అంటూ దర్వాన్ని అదిలించడంతో, దర్వాను ఆగిపోయాడు,

"యేమండి? .... యెవరు కావాలండి?" అన్నాడు భీం దొరతో గౌరవ పూర్వకంగా.

"ఎవరు బాబూ మీరు? ...... కలెక్టర్ గారి కేమవు తారు?" అడిగాడు భీం దొర.

"నేను కలెక్టరుగారికి తమ్ముడవుతాను...... నా పేరు భూపతి" చెప్పాడు కుర్రాడు.

"దండాలు బాబూ!" అంటూ మొదలు పెట్టి, తను వచ్చిన పని సంగతి వివరంగా చెప్పాడు భీం దొర.

భీం దొర మాటలు వినగానే, భూపతి మొహం సంతోషంతో వికసించింది.

"రండి! రండి! ...... కలెక్టరుగారితో మాట్లాడ దాం," అన్నాడు భూపతి లోనికి దారి తీస్తూ.

భీం దొర, భూపతిని అనుసరించాడు.

భీం దొర చెప్పిన కథ వింటూనే, కలెక్టరుగారు పక పకా నవ్వారు.

ఆ నవ్వు తాలూకు అర్థం భీం దొరకు బోధపడక పోయినా, అక్కడున్న తతిమ్మా వాళ్లందరికి తెలుసు.

భూపతికి వేటంటే చాలా యిష్టం. వారిది, రాజవంశ మేమో, వేట సరదా అతని కుటుంబం రక్తంలోనే ఉంది.

"అయితే వెళ్తానంటావ్!" అన్నాడు శ్రీపతి, తమ్ముడి వైపు చిరునవ్వు మొహంతో తిరిగి.

"అవునన్నయ్యా! నా సర్దా ఆపకు" అన్నాడు భూపతి, మొహం నిండా నవ్వుతో.

"ఓకే! దెన్!" అంటూ పనివాడ్ని కేకేసి, కాయితం కలం తెప్పించి, ఓ ఆర్డరు తన చేత్తోనే రాసాడు శ్రీపతి వెంటనే.

ఆర్డరు భీం దొర చేతిలో పెట్టి "నీ పని చాలా సులువయి పోయింది...... మా తమ్ముడు మంచి షికారీ..... నీతో పాటుగా పంపిస్తున్నాను. ఎంత బాగా చూసుకుంటావో మరి," అన్నాడు.

భీం దొర ఆనందం చెప్పవలసినది గాదు. షికారీ కోసం వెతుక్కునే యిబ్బందికూడా తప్పింది తనకు. "బాబూ! ...... చక్రవర్తిని చూసినట్టు చూసుకుంటానండి, మా వూళ్ళో, ఉన్నాళ్ళూ" అంటూ వినయంగా జవాబిచ్చాడు భీం దొర.

గంటలో తన హేవర్ సేక్ లో తనకు కావల్సిన బ్రెడ్, టిండ్ ఫ్రూట్, జామ్ టిన్ను, టిండ్ మటన్ వగైరా తిండి సామానులు పడేసుకుని, రెండు రగ్గులు, రెండు దుప్పట్లు, ఓ తువ్వాలూ, రెండు జతల బట్టలు బెడ్డింగ్ రోల్ గా చుట్టి పట్టుకుని, రైఫిల్ భుజానికి తగిలించుకుని బుల్లెట్సు పాక్ జేబులో కుక్కుకుని బయలు దేరాడు భూపతి, భీం దొర వెంట.

4

భీం దొర నాలుగవ భార్య సింగి వుంటున్న యిల్లు' ఆ వూర్లోని యిళ్ళకన్నా, విశాలంగా, శుభ్రంగా, అన్ని సౌకర్యాలతో ఉంటుంది.

తాత్కాలికంగా సింగిని, తన రెండవభార్య యింట్లో వుండమని చెప్పి, సింగి యిల్లు భూపతికి యిప్పించాడు భీం దొర.

కలెక్టరుగారి తమ్ముడు గొప్ప షికారీ అనీ, పులిని చంపడానికి, అతన్నే భీం దొర తీసుకొచ్చాడనీ అన్న వార్త ఊరంతా పాకిపోయింది క్షణంలో.

పిన్నా, పెద్దా, ఆడా మగా అందరూ ఒక్కుమ్మడిగా భూపతి బస చేస్తున్న యింటి మీదకు వచ్చిపడ్డారు.

గంటలో యిల్లు శుభ్రం చెయ్యబడింది. భూపతి స్నానం చెయ్యడానికి వేణ్ణీళ్లు సిద్ధం చెయ్యబడ్డాయి.

తన రాక ఆ వూరిలో పెద్ద సంచలమే కలిగించిందను కున్నాడు భూపతి, హడావిడిగా తన నివాసం కోసం యేర్పాట్లు చేస్తున్న జనాన్ని చూస్తూ.

ఆకాశంలో చంద్రుడు బాగా పైకి లేచాడు. డొంకిరి మెట్టగ్రామం, దాని చుట్టు ప్రక్కలనున్న అడవిప్రాంతం అంతా వెన్నెల్లో తడిసి, తమాషాగా అందాలు చింది స్తోంది.

వేడి వేడి వెదురుబియ్యపు అన్నం, రుచిగా వండిన జింక మాంసం, అంతకు ముందు భీందొరతో పాటుగా పోటీగా పుచ్చుకున్న యిప్పసారా- భూపతి కడుపులో పనిచేసి, అతని శరీరం, మనస్సు హాయిగా, తేలిగ్గా చేసే సాయి.

భూపతికి కేటాయించిన యింటికి దూరంగా బయలులో, పెద్ద దుంగలు ముట్టించి చలి మంట పెట్టారు. ఎర్రని మంటలు పైకి లేస్తుంటే, ఊరిలోని జనమంతా, ఆ మంట చుట్టూ చేరారు.

వెదురు కర్రలతో తయారు చేసిన స్టూలు ప్రత్యేకంగా భూపతి కోసం వేసి, అతడ్ని కూడా మంటకు చేరువగా కూచోబెట్టారు.

వాతావరణం అద్భుతంగా వుందనుకున్నాడు భూపతి. ఈ లోపున కొందరు మగాళ్లు, ఆడాళ్లు లేచి ఒకరి చేతులు ఒకరు పట్టుకుని వలయాకారంలో నిలుచున్నారు. వారిలో కొందరి కాళ్లకు గజ్జెలున్నాయి.

మెల్లగా ఎవరో ఒకరు పాట మొదలు పెట్టారు. ఆ పాటకు అనుగుణంగా, కాళ్లకు కట్టిన గజ్జెలు మోగు తున్నాయి.

ఆ వలయాకారం మధ్య సింగి చేరింది. ఆమెకూడా నాట్యం చేస్తోంది. మధ్య మధ్య ఆడవాళ్లతో వంత పాడుతూ.

అంచెలంచెలుగా తను ఆనందశిఖరాని కెగ్రబాకుతున్న ట్టుగా అనుభూతి చెందుతున్నాడు భూపతి.

ఒకే స్థాయిలో, నిదానంగా, పాట–దానితో కలిసి విని పిస్తూ, గజ్జెల మోత–బోరుకొడుతున్నట్టుగా ఫీలయ్యాడు భూపతి.

అర్థగంట గడిచింది. ఆగకుండా, గజ్జెల మోత విన్పి స్తూనే ఉంది. పాట సాగుతూనే ఉంది.

భూపతి కూచున్న చోటనే నిద్రపోసాగాడు.

5

"బాబూ! టీ తెచ్చాను!"

మూడోసారి సింగి అలా అనేసరికి, భూపతికి మెలుకువ వచ్చింది. కళ్లు తెరిచాడు. సింగివైపు జూశాడు.

సింగి యెప్పుడు నిద్ర లేచిందో యేమో, కడిగిన ముత్యంలా తళ తళ మెరుస్తోంది.

నూనె రాసుకుని నున్నగా పైకి దువ్వి కొన్న జుత్తు ఓ ప్రక్కకు బిగువుగా కొప్పు వేయబడింది. ముక్కున ముక్కెర, దండలకు కడియాలు, మోకాళ్ల వరకూ మాత్రం కొండ స్త్రీల పద్ధతిలో చీర కట్టుకుని ఉంది.

చేతిలో టీ గ్లాసు, పెదాల మీద చిరునవ్వుతో నిలు చున్న సింగిని చూడగానే, రాత్రి జ్ఞాపకాలు ఒక్క సారిగా మునిరాయి భూపతి మనసులో. అప్రయత్నం

గానే, అతని కళ్లు, ఆమె వంటి ఎత్తు పల్లాల మీద, పైకీ కిందికీ పరిగెత్తాయి.

నిజంగా సింగి అడవి మల్లే!...... అతని గుండెలు ఉద్రేకంతో పొంగాయి.

కాని, వెంటనే నిగ్రహించుకున్నాడు.

ఓ సారి మైసూరు అడవుల్లో భూపతి స్నేహితుడొకడు వేటాడ్డానికి వెళ్లాడు. ఆ అడవుల్లో వున్న పది రోజుల్లో, అతని కేంపుకు దగ్గరగా ఉన్న కొండజాతి పిల్లతో పరిచయమైందతడికి. ఆ అమ్మాయి కళ్లల్లో కొట్టొచ్చినట్టు అవుపించే అమాయకత్వం, ఆరోగ్యంగా, అందంగా ఆమె అవయవాల పొంకం చూసి ఉద్రేక పడ్డాడు. ఆ అమ్మాయికి కూడా అతనంటే యిష్టం యేర్పడింది.

వేట ముగిసి, కేంప్ యెత్తి వేస్తున్న రోజున, ఆ అమ్మాయి వచ్చింది, అతన్ని చూడ్డానికి. ఆమెను అనుభవించే అవకాశం లేకపోయినా, ఆమెను కనీసం ముద్దు పెట్టుకోవాలన్న కోరికను అణుచుకోలేకపోయాడు. జాగ్రత్తగా ఆలోచించి, అదే సాకుమీద, ఆ అమ్మాయిని అడివిలోకి తీసుకెళ్లాడు. ఓ చెట్టుబోదె నానుకుని నిల్చి, ఆమెను ముద్దు పెట్టుకోవాలని వంగేలోపల, రివ్వున ఓ బాణం వచ్చి, వాళ్ల తలకాయలపైన, బోదెమీద గుచ్చుకుంది. అతడి గుండె భయంతో గుబ గుబలాడిపోయింది. ఆ బాణాన్ని తన తలకాయకు గురి చేసి కొడ్తే, గురి తప్పి, చెట్టు బోదెకు గుచ్చుకుందేమో, తన అదృష్టంకొద్దీ!

ఆమెను కౌగలించుకోవాలి, ముద్దు పెట్టుకోవాలి అన్న కోరిక గాలిలోకి పిట్టలా ఎగిరిపోయింది. ఆమెను అక్కడే వదిలేసి, అదరా బాదరా కేంపుకి వచ్చిపడ్డాడు.

తన స్నేహితుడి అనుభవం గుర్తుకి రాగానే ఒక్క సారిగా ఒళ్ళు జలదరించింది భూపతికి.

లేచి, చూపులు మరల్చి, టీ గ్లాసు అందుకుని కృతజ్ఞతతో త్రాగాడు.

"లేచి మొహం కడుక్కోండి. ఫలహారం చేద్దురుగాని" అంటూ ఖాళీగ్లాసు తీసుకుని, నవ్వుతూ వెళ్ళిపోయింది సింగి.

లేచి, మొహం కడుక్కుని వచ్చేసరికి, సింగి వేణ్ణీళ్ళతో సిద్ధంగా ఉంది.

"నేను పోసుకుంటానులే. నువ్వెళ్ళు" అంటూ భూపతి ఎంత గొడవ పెట్టినా సింగి విన్పించుకోలేదు. భూపతికి ఒళ్ళు తోమి, నీళ్ళు పోసింది. ఆ తరువాత, అప్పుడే ఉడికించి తెచ్చిన ఉడుకుడుకు పెండలం దుంపలు ఫలహారంగా పెట్టి, త్రాగడానికి గేదె పాలు యిచ్చింది.

తనతో తెచ్చిన బ్రెడ్, జాం మిగిలిపోయి, పనికి రాకుండా పోనివ్వకుండా, సింగికి, భీందొరకు యిచ్చాడు భూపతి.

పట్నం తిండి ఎంతో రుచిగానూ, తమాషాగానూ, అనిపించిందేమో, బ్రెడ్ జాం తింటూ ఎంతో మెచ్చుకుంది సింగి.

ఉదయం పది గంటలవుతుంటే, ధొరమ్, మరో యిద్దరు యువకులు వచ్చారు భూపతి దగ్గరకు.

"పులిని మాటువేసి చంపడానికి రెండు పద్ధతులున్నాయి. ఒకటి, అది తరచుగా తిరిగే ప్రాంతాల్లో దూడనో, గేదెపెయ్యనో మాటుగా పెట్టి, అది దాన్ని చంపి తింటున్న సమయంలో కాల్చి చంపడం. రెండు, చంపిన జంతువుని పులి ఓ రహస్య స్థలానికి యీడ్చుకుపోతుంది. ఆ స్థలమేదో తెలుసుకుని పులి తన ఆహారం

దగ్గరకు తిరిగి వచ్చే క్షణం కోసం యెదురు చూసి, అది రాగానే కాల్చి చంపడం. ధోరమ్ మామ్మను పులి చంపేసి మూడు రోజులవుతోంది. అంటే పులి, ధోరమ్ మామ్మను పూర్తిగా తినేసి వుండాలి, యీపాటికి. అయితే, సాధారణంగా పులి తిరుగాడే స్థలం గురించి తెలుసుకోవాలి కాబట్టి, ముందుగా, ధోరమ్ మామ్మ శరీరం అవశేషాలు యెక్కడ మీకవుపించాయేమో చూడండి?" అన్నాడు భూపతి, వచ్చిన వాళ్ళతో.

"అలాగే బాబూ!...పదండి; చూపుతాం" అన్నారు యువకులు.

వారి వెంట, లోడ్ చేసిన రైఫిలు చేతిలోకి పట్టుకుని భూపతి బయలుదేరాడు. అతని వెంట భీంవొర కూడా కదిలాడు అడవికి.

6

సామాన్యంగా పులి 30 నుంచి 40 ఏళ్ళవరకూ బ్రతుకుతుంది. ముసలితనం ముంచుకురావడంవల్లనో, ఏ వేటగాడి గుండో తగిలి అవిటిదై పోవడంవల్లనో, అడివిలో చురుగ్గా పరుగెత్తి పారిపోయే జంతువుల్ని వెంటాడి చంపగలిగే శక్తి సన్నగిల్లుతుంది పులికి.

అప్పుడే పశువుల మందమీదబడి, పశువుల్ని యెత్తుకుపోవడం, ఊర్ల మీదబడి, మనుషుల్ని యెత్తుకుపోవడమో చేస్తాయి పులులు.

తన ఆహారం విషయంలో పులికి యేలాంటి నిషేధాలూ, నియమాలూ లేవు. ఏ జంతువు మాంసాన్నైనా, ఆఖరుకు కుళ్ళి పురుగులోడుతున్నా తింటాయి. పులి కప్పల్ని, కోతుల్ని, ఎలుగుబంటుల్ని — చివరకు తమ జాతి వాటిని కూడా తిన్నట్టు రికార్డుల్లో ఉంది.

పులి జంతువు మెడదగ్గర కొరికి చంపుతుంది. చంపిన జంతువు వెనకభాగం నించి తినడం ఆరంభించుతుంది. చిరుతపులుల్లాగు, అవి ముందునుంచి తమ జంతువుల్ని తినవు. తరుచుగా తోక కొరికి, దూరంగా విసిరేస్తుంది. ఒక్కోసారి, చెవుల్ని కూడా కొరికి పారివేయడం కద్దు. జంతువు చర్మాన్ని, దాని వంట్లోని చిన్న ఎముకల్ని కూడా వదిలేయకుండా అరగిస్తుంది పులి.

మనుషుల్లో కొంతమంది, వంటింట్లో భోంచేస్తుంటే, వాళ్ళ తిండి చప్పుడు వీధిలోకి విన్పిస్తుంది. పులి అలాంటి వాళ్ళకోవకే చెందుతుంది. పులి తన ఆహారాన్ని తింటుంటే, తింటున్న చప్పుడు, అడవిలో చాలాదూరం విన్పిస్తుంది.

లేళ్ళు, దుప్పులు, ఏనుగులు వగైరా కొన్ని అడివి జంతువుల్లాగు పులి మందలుగా తిరగదు. ఒకవేళ, అలాంటిది జరిగిందంటే, అవి ఒకే కుటుంబానికి చెందినవన్నమాట.

భీందొర, ధోరమ్, మరో ఇద్దరు డొంకిరిమెట్ట యువకులు వెంటరాగా, అడివిలోకి బయలుదేరిన భూపతికి, పులి గురించి, తను తెలుసుకొన్నదంతా గుర్తుకొచ్చింది.

వేటాడదల్చుకున్న పులిగురించి ఆచూకీ తీయాలంటే, అడవుల్లో చాలాదూరం తిరగాల్సి వుంటుంది. ఫ్రీగా వెళ్ళడానికి, వీలైన సమతల ప్రదేశంగాని, రోడ్లుగాని ఉండవు కాబట్టి, కార్లు, జీపులు వగైరా ఆధునిక వాహనాలు వాడడానికి అవకాశంలేదు. కాలినడక ఒక్కటే శరణ్యం.

అయితే, కొందరు షికారీలు యేనుగుల్ని ఉపయోగించడం కద్దు. కాని, పులి సమీపంలో ఉందని వాటికి అనుమానం కలగ్గానే, బెదిరి పరుగుదీస్తాయి. చెట్లకొమ్మలకు తగిలి, షికారీలు తిన్నగా పులినోట్లో పడటం జరుగుతుంది.

ఏదియేమైనా, భూపతికి కాలినడకన పోయి, అడవిలో వేటాడ్డమంటేనే ఇష్టం.

అయినా, డొంకిరిమెట్ట ప్రాంతంలో, ఏనుగులు ఎక్కడున్నాయి?

భూపతి, తన అనుయాయులతో, సుమారు అయిదు మైళ్ళు అడవిలోకి చొచ్చుకువెళ్ళాడు. త్రోవలో అగపడ్డ నీటిపట్టులని, పులి వచ్చివెళ్ళిన పంజా గుర్తులకోసం వెదికాడు.

సాధారణంగా అడివి జంతువులు తమ దప్పిక దీర్చుకోవటం కోసం విధిగా నీటిపట్టులకు వస్తాయి.

అలా వచ్చే మృగాల్ని వెంటాడి చంపి తినడానికి, తమ దప్పిక దీర్చుకోడానికి కూడా, పులులు నీరున్న చోట్లకు వస్తాయి.

ఏవేవో జంతువుల కాలిముద్రలతో పాటుగా, పులి పాదాల ముద్రలుకూడా అగపడ్డాయిగాని, అవి మొన్నటివిలా లేవు.

ధోరమ్ మామ్మ కట్టుకొన్న చీర తాలూకు పీలికలూ, ఆమె జుత్తూ వగైరా ఆమె శరీరావశేషాలు తా మెక్కడ చూసారో ఆ స్థలాన్ని వారు చూపారుగాని, వాటివల్ల ప్రస్తుతానికి పెద్ద ప్రయోజనం లేదు భూపతికి.

అవాల్టికి పులికోసం ఆరాలు తీయడం ఆపి, అలసిన శరీరంతో, సలుపుతున్న కాళ్ళతో, డొంకిరిమెట్ట తిరిగొచ్చాడు భూపతి.

7

సాయంకాలం ఆరున్నర కాగానే, చిక్కని చీకటి అలుముకుంది, డొంకిరిమెట్ట అరణ్య ప్రాంతంలో. ఏడు కాగానే, పిల్లలు, బాగా వయసు మీరిన వృద్ధులు ఇళ్ళల్లోకి పోయి నిద్రపోయారు.

మిగతా వాళ్ళు, ఊరిమధ్య వేసిన చలిమంట చుట్టూ

చేరారు యెప్పటిలా. స్త్రీ, పురుషులనే తేడా లేకుండా, ఇప్పసారా తెచ్చుకుని త్రాగారు.

"బాబూ! ఇప్పసారా మీకు తెచ్చేదా?" అడిగింది సింగి, భూపతివద్దకు వచ్చి.

సింగి గత రాత్రికి మల్లెనే, నీటుగా, అందంగా అలంకరించుకుని, ఆకుపచ్చ చీరలో కడిగిన ముత్యంలా మెరిసిపోతోంది. చలిమంట వెలుగులో, తమాషాగా, తట్టుకో లేనంత ఆకర్షణతో అవుపించింది సింగి.

ఒళ్ళంతా, నరాలు పురిపెడ్తూ, తీయని తీపు. ఎదురుగా వున్న సింగిని చూస్తుంటే, భూపతి మనస్సు వశం తప్పుతోంది.

"ఏం బాబూ! తెచ్చేదా?" అంది సింగి రెండోసారి, భూపతి తన మాటలు వినలేదేమోనని.

తన వూహాల్ని అప్పుడు అదుపులోకి తెచ్చుకున్నాడు భూపతి.

"వద్దు. పట్నం సారా వుంది నా దగ్గర. రుచి చూస్తారా మీరు?" అన్నాడు భూపతి.

పట్నం సారా మాట చెవిని పడగానే అప్పుడే అక్కడకు వచ్చిన భీందొర చప్పున భూపతి ప్రక్కకు వంగాడు. "పదండి. ఇంటిలోకి పోయి తాగుదాం. వీళ్ళందరూ వచ్చి పడ్డారంటే, చుక్కగూడా మిగలదు" అన్నాడు గొంతు బాగా తగ్గించి.

పట్నం సారా అంటే, ఆ ప్రజలకు అంత మోజు వుంటుందనుకోలేదు భూపతి.

"పదండి వెళ్దాం" అన్నాడు లేచి భూపతి.

"దొరగారికి నిద్దరొస్తోందట. పోయి పడుకుంటాం. రేపు కాస్త పెందరాళే బయలుదేరండి. అడవిలోకి

వెళ్దాం'' అన్నాడు భీందొర లేచి, ఆ చలిమంట చుట్టూ కూచున్న జనాన్ని చూసి.

''అలాగే దొరా'' అంటూ తలలూపారు, అప్పటికే ఇప్పసారా తలకెక్కిన జనం.

ముందు భీందొర, వెనుక భూపతి, ఆ వెనుక సింగి, ఇంట్లోకి వచ్చిపడ్డారు.

''పట్నం సరుకు రుచిచూసి చాలా రోజులైందిబాబూ!'' భీందొర నోరు చప్పరించాడు.

''ఆహాఁ... అలాగా!'' అంటూ ఓల్డ్‌మాంక్ రమ్ బాటిలు తెరిచాడు భూపతి.

ఈలోపున సింగి వెళ్ళి, మూడు గిన్నెలనిండా అన్నం, పైన మాంసం కూరపెట్టి తెచ్చి, తనముందరొకటి పెట్టుకుని, వారిద్దరికీ చెరో గిన్నె ఇచ్చింది.

మూడు గ్లాసులోని రమ్ ఒంపి, తర్వాత నీళ్ళతో నింపి, తలో గ్లాసు అందించాడు భూపతి.

తన గ్లాసులోని ద్రవాన్ని కాస్త పీల్చి చప్పరించి ''యెలా వుంది?'' అన్నాడు భూపతి, తన కెదురుగా కూచున్న ఆ ఇద్దరితో.

గుక్కెడు తాగి ''చాలా బావుంది బాబూ!'' అంది సింగి కృతజ్ఞత మెరిసే కళ్ళతో.

''పట్నం సరుకే సరుకు. వేరే చెప్పేలా? అమృతం'' అంటూ భీందొర, తన గ్లాసులోదంతా ఒక్క గుక్కలో పీల్చేసాడు.

ఇప్పసారా తాగినట్టు ఒకేసారి తాగెయ్యకూడదనీ, రమ్ మెల్లమెల్లగా కొద్దికొద్దిగా చప్పరిస్తూ తాగితేనే అందం, ఆనందం అని భీందొరకు చెప్పాలనుకున్నాడు భూపతి. కాని, యెందుకో మనసు మార్చుకున్నాడు.

తన ముందరున్న గిన్నెలోని అన్నం కూర గబగబా కలిపి, రెండు ముద్దలు నోట్లో పెట్టుకుని, ఖాళీ గ్లాసు నింపమన్నట్టుగా, ఖాళీ గ్లాసువైపు, భూపతి మొహంలోకి క్షణం మార్చి మార్చి చూసాడు భీందొర.

భూపతి అర్థం చేసుకొన్నాడు.

భీందొర గ్లాసులో సగం మేరకు రమ్ పోసి, మిగతా సగం నీటితో నింపడానికి, మంచినీళ్ళ చెంబు అందుకున్నాడు భూపతి. కాని, భీందొర, గ్లాసు మూతికి చెయ్యి అడ్డంగా పెట్టి "రుచి చెడిపోతుంది బాబూ!" అన్నాడు.

వేరే మార్గంలేక, నీరుపోయడం విరమించుకుని, గ్లాసులోని తతిమ్మా సగం కూడా రమ్‌తో నింపాడు భూపతి.

"చాలు బాబూ! నెలకోసారి ఇలాంటి సరుకు పుచ్చుకోవాలి" అంటూ గ్లాసు యెత్తి ఒక్క వూపులో గ్లాసులోని ద్రవాన్ని గొంతుకలోకి పోసేసుకున్నాడు భీందొర.

రెండు క్షణాలు భీందొరవైపు చూస్తూ ఉండిపోయాడు భూపతి. ఆ మీదట, తన గ్లాసు అందుకుని, అందులోని ద్రవాన్ని మెల్లిగా త్రాగుతూ సింగివైపు చూసాడు.

ఆమె భూపతివేపే చూసి, నవ్వుతూ, తన గ్లాసులోని ద్రవాన్ని త్రాగుతోంది.

భీందొర మీద రమ్ క్షణాల్లో పనిచేసింది. అతని చూపులు మారిపోయాయి. చేష్టలు కూడా మారిపోయాయి. అన్నం మరి రెండు ముద్దలు నోట్లో పెట్టుకున్న తర్వాత, అన్నం కలుపుతూనే కూచున్నాడు "సరుకు చాలా బావుంది" అని తనలో తను గొణుక్కుంటూ.

అలా అయిదు నిమిషాలు గడిచాయి. ఆ తరువాత, గోడకు చేరబడి గురకదీయ సాగాడు భీందొర.

గురక దీస్తుంటే, అతని నోట్లోంచి వెలువడే గాలికి, అతని బుర్రమీసాలు కంగారుగా ఎగిరి పడుతుంటాయి.

నవ్వాపుకోలేక పోయాడు భూపతి.

గట్టిగా, విరగబడి నవ్వాడు. సింగి కూడా నవ్వింది గలగలా. పల్చగా సాగిన పెదాలమధ్య మల్లెమొగ్గలా తెల్లగా మెరుస్తున్నాయి ఆమె పళ్ళు.

ఆమె, తనూ ఇప్పుడు ఒంటరిగా ఉన్నారన్న ఫీలింగు కలగానే, అతని రక్తం దూకుడు ఆరంభించింది.

"ఏంచేద్దాం?" అన్నాడు వణికే గొంతుకతో.

"చెయ్యి కడిగి, అవతలి గదిలో మంచంమీద పడుకో బెట్టి వస్తానుండండి," అంది సింగి లేస్తూ.

అతని ముందరున్న కంచంలోకే భీందొర చెయిలో కడిగి, మూతి తుడిచింది సింగి. ఆ తరువాత, చంకల్లో చేతులు జొనిపి భీందొరని లేవదియ్యడానికి ప్రయత్నిం చింది. కాని, పట్టుకు దొరికికూడా జారిపోయాడు భీందొర.

"మీరు కూడా ఓ చెయ్యి వెయ్యాలి కాస్త" అంది సింగి మళ్ళా పట్టుకోసం ప్రయత్నిస్తూ.

భూపతి లేచాడు, తాగుతున్న గ్లాసు నేలమీద పెట్టి.

ఇద్దరూ, చెరో ప్రక్క పట్టుకుని, భీందొరని లేవనెత్తి, ప్రక్క గదిలో మంచంమీద పడేసి వెనక్కి వచ్చి కూచున్నారు.

భూపతికి యెంతో ఇబ్బందిగా వుంది. అయినా, ఇష్టంగానే వుంది, లోలోన. ఆడవాళ్ళతో రాత్రిపూట ఒంటరిగా ఉండడం అదే మొదటిసారి భూపతికి.

పైగా సింగి చూపులు అతణ్ణి ఎక్కడెక్కడో గుచ్చి కవ్విస్తున్నాయి సుతిమెత్తనగా.

బైట చలిమంటవద్ద ఎవరో పాట అందుకున్నారు. తతిమ్మా వాళ్ళు - ఆడా మగా కలిసి శృతి కలిపారు.

చెట్టా పట్టా వేసుకుని, గతరాత్రి లాగానే వాళ్ళు

నృత్యం ఆరంభించారు.

పాటతో కలిసి, కాళ్ళగజ్జెల చప్పుడు, ఆ నిశ్శబ్ద నిశీధిలో ఒకే స్థాయిలో, ఉండలోంచి దారం లాగుతున్నట్టుగా, వినపడుతుంటే, తియ్యగా ఏదో మత్తు ముంచేస్తున్నట్టుగా ఉంది భూపతికి.

"ఆ పాటకి అర్థం యేమిటి?" అన్నాడు, ఏదో అడగాలి కాబట్టి, తను పడుతున్న ఇబ్బందిని కప్పిపుచ్చుకోవడానికి.

"అర్థమా?" అంటూ ఆగిపోయింది సింగి, సగంలో, ఏదో ఆలోచిస్తున్నట్టు.

రమ్ కైపు ఆమె తలకు బాగా యెక్కిందని; ఆమె తన మనసు కేంద్రీకరించే శక్తి కోల్పోయిందని గ్రహించాడు భూపతి.

"ఊఁ చెప్పు" అన్నాడు భూపతి, రెండు క్షణాలు గడిచినా, ఆమె జవాబివ్వక పోయేసరికి.

ఆమె సన్నగా జోగుతోంది.

"అదీ! అదీ!" అంటూ కిసుక్కున నవ్వి, క్షణంసేపు భూపతి కళ్ళల్లోకి ఓ వింత చూపు చూసి "అదీ మొగుడూ పెళ్ళాల వలపు పాట" అంది.

"మొగుడు పాడ్తున్నదా? పెళ్ళాం పాడ్తున్నదా?" అడిగాడు భూపతి, ఆమె చూపులు తన వంట్లో రేపుతున్న కలవరాన్ని నొక్కి పడుతూ.

"పెళ్ళామే" జవాబిచ్చింది సింగి. ఆమె మొహంలో అదే వింత చూపు. మళ్ళా అదే తమాషా నవ్వు.

"ఏమని?" అడిగాడు, తడారిపోయిన గొంతుకతో.

"ఏమనా?" అంటూ లేచిందామె. ఆమె కళ్ళల్లో కొట్టొచ్చే తీవ్రత, ఏదో సాధించి తీరాలనే పట్టుదల.

ఆమె ప్రవర్తన వింతగానూ, గుబులు గొల్పుతున్నట్టుగా అనిపించిదతడికి.

ఆమె తిన్నగా దీపం ఉన్న గూటి దగ్గరకు కదిలింది.

ఆమెను పరిశీలిస్తున్నాడు దీక్షగా. కాని భయం భయంగానే వుంది.

గూటిలోని దీపం గుఫ్‌మంటూ ఆరింది.

బయట కురుస్తున్న వెన్నెల కాంతి కాస్త గదిలోకి వచ్చి పడుతుందేమో, ఆమె నీడ అవుపిస్తూనే ఉంది, దీపం ఆరిపోయినా.

ఆమె నీడ ఒక్క క్షణం ఆగింది. ఆగి, ఉన్న చోటనే కదలిన తీరునుబట్టి, సింగి చేస్తున్నదేమిటో తెలుసు కున్నాడు.

ఆమె తన ఒంటిమీద బట్టలు విడిచేసింది.

ఏం చెయ్యాలో పాలుపోక ఉన్న చోటనే రాయిలా ఉండిపోయాడు భూపతి.

మరుక్షణంలో ఆమె అతనిమీద విరుచుకు పడింది. ఆవేశంగా, ఆమె చేతులు అతన్ని చుట్టేసాయి. పిండి ముద్దల్లాంటి పెద్ద రొమ్ములు అతడి ఛాతీని కుమ్మసాగాయి.

అదే సమయంలో, ఇంటి వెనుక గొడ్లకొట్టంలో, ఆవు పెడుతున్న మూలుగు కాబోలు విన్పించింది.

"ఏమిటూ చప్పుడు?" అడిగాడు భూపతి.

అతనిమీద ఆత్రంగా కదులుతున్న సింగి క్షణం ఆగింది.

గొడ్లకొట్టంలోని శబ్దాలు స్పష్టంగా విన్పించసాగాయి.

ఆవు మూలుగుతోంది దీనంగా ఎందుకో. ఏదో కొట్టు కుంటున్న చప్పుడు. ఇంకో క్షణం తర్వాత, ఏదో విరిగి నట్టుగా గరుగ్గా రాసుకుంటున్నట్టుగా చప్పుడు.

భూపతికి అర్థమైంది అదేమిటో. పులి వచ్చి, పాకలో ఉన్న ఆవును చంపి, నోరు కరుచుకుపోతోంది.

ఒక్క వూపులో, తన మీదున్న సింగిని ప్రక్కకు తోసేసాడు. బట్టలు సర్దుకుని, టార్చిలైటు అందుకుని, దొడ్డి తలుపులు తెరిచి, వెలుపలికి ఉరికాడు.

భూపతి కరెక్టుగానే వూహించాడు. కొట్టంలో, ఆవు చనిపోయిన చోట నెత్తురు మండలం. అక్కడ్నుంచి, ఆవు కళేబరాన్ని పులి ఈడ్చుకెళ్ళిన త్రోవకంటా నెత్తుటి చార. పులి క్షణాల్లో తన పని పూర్తి చేసుకుని అడివిలోకి పారిపోయింది అనుకున్నాడు.

ఆ రాత్రిపూట తను చెయ్యగలిగిందేమీ లేదు. చంపిన జంతువును, మళ్ళా వచ్చి, తీరిగ్గా తినడానికి, ఓ రహస్య ప్రదేశంలో ఉంచుతుంది పులి. తెల్లవారగానే పోయి, ఆ ప్రదేశాన్ని కనుక్కోవాలి.

భూపతి వెనక్కి వచ్చాడు. దీపం వెలిగించాడు. బట్టలు కట్టుకుని, చిన్నబోయిన మొహంతో, దిగాలుగా కూర్చుని ఉంది సింగి అతడి ప్రక్కమీద.

ఏంజరిగిందో చెప్పాడామెకు. ఆమె ఆరాటం చూప లేదు. ఆశ్చర్యపోయాడు. తన వాంఛలు, ఇష్టాలు తీరడం తప్ప ఇంకేమీ లక్ష్యపెట్టదా?

ఆ తరువాత, చలిమంటవద్ద కూచున్న జనంవద్దకు వెళ్ళి, పులి వచ్చివెళ్ళిన సంగతి చెప్పాడు. జనం మొహంలో భీతావహం తొంగిచూసింది. మర్నాడు యేంచెయ్యాలో వాళ్ళకు క్లుప్తంగా చెప్పి, ఇంట్లోకి వచ్చాడు.

8

గడచిన రాత్రంతా నిద్ర లేదు భూపతికి. భయంకరమైన కలలు అతడ్ని వెంటాడినాయి, నిద్ర తెచ్చుకోవడానికి

ప్రయత్నించినకొద్దీ.

కాసేపు, ఊరిలో జొరబడి, ఏ మనిషినో, ఏ పశువునో చంపి, ఓ పులి యెత్తుకపోతున్నట్టుగా కలవస్తే, మరి కాసేపు సింగి, ఆడపులిలా తనమీదబడి గోమ్ములతో కుమ్ముతూ, తొడలతో నొక్కేస్తూ, పళ్ళతో తన పెదాలు కొరికేస్తూ, తన రక్తవీర్యాలు పూర్తిగా పీల్చేసిందాకా వదలనట్టు కల వచ్చేది.

"బాబూ! నా ఆవుని పులి యెత్తుకపోయిందా? చూసి వస్తున్నారా?" ఆవేదనతో కుమిలిపోతూ వచ్చాడు భీందొర.

భూపతి లేచి కూచున్నాడు మంచంమీద.

"అవును దొరా! అంతా క్షణాల్లో జరిగిపోయింది. నేను పోయి చూసేలోపల, అది మీ ఆవుని నోట కరుచుకుని చీకట్లో అడివిలోకి పారిపోయింది" చెప్పాడు భూపతి.

"ఎంత పని జరిగిపోయింది బాబూ! నా తల్లిని ఎంత పనిచేసింది బాబూ ఆ పులి!" దుఃఖించాడు భీందొర.

"విచారించి లాభంలేదు దొరా! అయితే ఇప్పుడు పులిని వేటాడ్డం సులువు. చంపిన జంతువును వెంటనే తినేయదు పులి. ఎవరూ తనను వెన్నాడ్డంలేదని నిర్ధారించుకునేంతవరకూ, తన ఆహారాన్ని ఓ స్థలంలో దాస్తుంది. ఆ స్థలమేదో కనుక్కొని, కాసి అది తిరిగి ఆహారానికి వచ్చేటప్పుడు కాల్చి చంపాలి," అన్నాడు భూపతి, లేచి కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఉద్యమిస్తూ.

"అలాగే బాబూ! మన వాళ్ళని గంటలో తయారయి ఉండమంటాను. అడివిలోకి వెళ్దాం" అంటూ వెళ్ళిపోయాడు భీందొర.

భీందొర ఇలా అటు వెళ్ళగానే, సింగి ఇటు వచ్చింది. ఆమె ముహంలో ఎందుకో తీక్షణత, సన్నగా రాజుకున్న కోపం అవుపిస్తున్నాయి. అయినా, భూపతి వద్దంటున్నా, ఒళ్ళు తోమి నీళ్ళు పోసింది.

ఆ తరువాత పళ్లెంతో ఫలహారం తెచ్చిపెట్టి, అతని ముందరనుంచి వెళ్ళిపోయింది.

ఫలహారం తిని చెయ్యి కడుక్కొని గదిలోకి వచ్చాడు. కట్టుకున్న లుంగీ విడిచేసి, పాంటు అందుకున్నాడు తొడుక్కోవడానికి.

కాని, భూపతి చేతిలోని పాంటు ఊడి కిందపడింది. దానికి కారణం తెలుసుకోవాలని తలెత్తి చూసాడు. పరిస్థితి గ్రహించి, తప్పుకుందామని అతడనుకునే లోపల సింగి, అతని నగ్న శరీరాన్ని, బలంగా తన గుండెలకు అదుముకుంటూ ఉద్రేకపడుతోంది.

ఆమెను ఎలాగైనా వదిలించుకోవాలన్న ఆలోచన తప్ప, ఇంకో ఆలోచన లేదతడికి ఆ క్షణంలో.

"స్నానం చేసాక మలినం కావడం బావుండదు" అన్నాడు తన మొహాన్ని వెతుకుతున్న ఆమె మొహాన్ని తప్పించుకుంటూ.

సింగి ఆగింది ఒక్క క్షణం. కాని, అతడ్ని తన కౌగిలి నించి పూర్తిగా విడిచిపెట్టలేదు.

ఆమె చేతులు అతడ్ని ఆవరించుకునే ఉన్నాయి. ఆమె స్తనాలు, అతడి ఛాతీమీద ఒత్తుతూనే ఉన్నాయి ఇంకా బలంగానే.

అంటే, ఏదో వాగ్దానం చేస్తేగాని, ఆశ పెడితేగాని, ఆమె ఆ క్షణంలో విడవదన్నది అర్థమైంది అతడికి.

"ఈ రాత్రికి తప్పకుండా... ఒట్టు" అన్నాడు నమ్మకంగా.

"నిజంగా... మాట తప్పవుగదా?" అంది సింగి, చిరునవ్వు తెచ్చుకుని.

"నీమీద ఒట్టు... తప్పకుండా" ఆమె తలమీద చెయ్యేసి అన్నాడు.

అప్పుడు విడిచిపెట్టి వెళ్ళిందామె అతడ్ని.

భూపతి బట్టలు వేసుకుని సిద్ధంగా కూచున్న పావుగంటకుగాని భీందొర, కుర్రాళ్ళని వెంటబెట్టుకు రాలేదు.

లోడ్ చేసిన తుపాకీ భుజానికి తగిలించుకుని, త్రోవలో ఆకలేస్తే తినడానికి నాలుగు బిస్కట్టు పాకట్టు, ఓ తువ్వాలు, రగ్గు, కాసిన్ని సిగరెట్లు హేవర్ సేక్‌లో పడేసుకుని, బయలుదేరాడు భూపతి.

9

అడవిలో సంచరించే విద్యలో పులివంటి మేధావి ఇంకో జంతువు లేదు. అడవిలో నిట్టనిలువుగాపడే సూర్యకిరణాలు, చెట్ల ఆకులు, కొమ్మల నీడలతో కలిసిపోయేలా దాని రంగు రూపం ఉంటే, అది నడుస్తుంటే, శబ్దంగాకుండా, దాని పాదాలక్రింద మెత్తని మాంసం దిండ్లు ఉన్నాయి. చిన్న కొడవళ్ళవంటి పంజాగోళ్ళు, అది నడుస్తూంటే, పాదాల్లోకి ముడుచుకుపోతాయి.

అన్నివిధాలా దానికన్నా ఎన్నోరెట్లు తెలివితేటలున్న మనిషిని కూడా భ్రాంతిలో ముంచేసే చాకచక్యం ఉంది పులికి.

ఓసారి ఓ షికారీ, తన మనుషుల్ని తోడుపెట్టుకుని అడివిలోకి వెళ్ళాడు వేటకోసం. ఓ ప్రదేశాన్నెన్నుకుని, అక్కడున్న ఓ చెట్టుమీద మంచె కట్టడానికి నిర్ణయించు

కున్నాడు. అతని తోటి మనుషులు మంచెకు కావాల్సిన కొమ్మలు వగైరా యేర్పాటుచేసే పనిలో మునిగిపోయి, చెట్లకొమ్మలు నరకటం వగైరా చెయ్యసాగారు. ఆ చెట్టు పైనుంచి చూస్తే, అవుపించే, చిన్న పొదలోకి పులి రావాలని ఆ షికారీ అంచనా.

తన మనుషులు మంచెకట్టే ప్రయత్నంలో ఉంటే, ఆ షికారీ యథాలాపంగా చెట్టు ఎక్కాడు. మామూలుగా, పొదలోకి చూసాడు. అతడి గుండెలు ధన్ మన్నాయి. ఆ పొదలో పులి ఉంది, ఎప్పుడు, ఎలా వచ్చిందో ఏమిటో.

ఆ రోజున ఆ షికారీ అతని మనుషులు సుమారు ఆరు గంటల సమయం ఆ ప్రాంతంలో గడిపారు. ఎన్నోసార్లు, దగ్గరున్న చెట్లు యెక్కి, ఆ పొదలోకి చూసారు. కాని పులి కన్పడలేదు వాళ్ళకు.

అది అంతసేపూ అక్కడే వుండి, వాళ్ళ కవుపించ లేదా? లేక, వాళ్ళు, తమ పనులలో ఉంటే, గాలిలా నిశ్శబ్దంగా ఆ పొదలోకి చొరబడిందా?

రెండూ సంభవమే! అదీ పులి చాతుర్యం! నీడకన్నా నిశ్శబ్దంగా, గాలికన్నా అదృశ్యంగా పులి వచ్చి వెళ్ళిపో గలదు.

ముందు రాత్రి భీందొర దొడ్డిలోని ఆవుని కూడా అంతే చాకచక్యంగా చంపి, క్షణాల్లో యెత్తుకుపోయింది.

ఆవుకు లేశమాత్రం కూడా అనుమానం కలగకుండా యెక్కడో దాక్కొని ఒక్కసారిగా తన అయిదువందల పౌన్ల బరువుతో దానిమీదపడి ఉంటుంది. ప్రమాదం గుర్తెరిగి ఆవు అరిచేలోపల, దాని మెడకొరికి, యెముకలు విరిచేసి ఉంటుంది. ఆ తరువాత అంతా మామూలుగా జరిగిపోయింది. ఎంత బలిష్ఠంగా, బరువుగా ఉన్న జంతువు

కళేబరాన్నైనా, అవలీలగా నోట కరచుకుని, ఎత్తుకు పోగలదు పులి మైళ్ళదూరం అయినా.

భీందొర దొడ్డిలో ఆవుని చంపిన ప్రదేశంనుంచి, త్రోవలో కన్పడే రక్తం గుర్తులుబట్టి, బయలుదేరారు భూపతి, భీందొర, డొంకిరిమెట్ట యువకులు.

గడ్డిమీద, మొక్కలమీద కారిన నెత్తురుబట్టి, మట్టి లోనూ ఇసకలోనూ అవుపించే పాదాల ముద్రలుబట్టి, పులి ఆవు కళేబరాన్ని లాక్కుంటూ పోయిన మార్గం కనుక్కోగలిగారు వాళ్ళు.

ఆ తరువాత ఆ చుట్టుపట్ల యెంత వెతికినా, యేలాంటి గుర్తులు అగపడలేదు.

"ఇక్కడెక్కడో పులి తన ఆహారాన్ని దాచింది. జాగ్రత్తగా వెతకండి" అరిచాడు భూపతి తనవాళ్ళ నుద్దేశించి.

నలుగురూ నాలుగు వైపులకూ కదిలారు.

ఆకాశంలో యెగిరే రాబందులుగాని, అడవిలోకి తిరిగే చిరుతపులులు, సింధువులు వగైరా మాంసభక్షకులు గాని చూడ్డానికి వీల్లేకుండా, తన ఆహారాన్ని అతి రహస్య స్థలంలో దాస్తుంది పులి. ఆ రహస్య స్థలం సాధారణంగా నీరు విరివిగా దొరికే చోటుకు పాతిక మైళ్ళ గజాల్లో ఉండేలా చూసుకుని మరీ ఎన్నుకొంటుంది.

అడవిలో రకరకాల తుప్పలు, చెట్లు, పొదలు, ఎత్తైన గడ్డి గుబుర్లు ఉండి, నేలంతా ఎగుడు దిగుడుగా, అవతల ఏముందో ఊహించడానికి కూడా వీలులేకుండా వుంటుంది. అడవిలో సంచరించే విద్యలో పులి మేధావి కాబట్టి, అడవిలోని ప్రతి ఆకుని, తుప్పని, తన అవసరాలకు బాగా ఉపయోగించుకుంటుంది.

తుప్పల్ని ప్రక్కకు నెట్టుకుంటూ, పొదల్ని కదిలించి అందులోకి దూరి చూస్తూ, పాతిక చదరపుగజాల మేరని ప్రతి అంగుళం వెదకి చూసారు. కాని ప్రయోజనం లేక పోయింది.

ఇహ అలా వెదకడంవల్ల లాభం ఉండదని, దగ్గర్లో ఉన్న చెట్లన్నీ యెక్కి, గుబురుగానూ, మధ్యలో సమతల ప్రదేశంగానూ ఉన్న జాగా కనిపిస్తే చెప్పమని, తన వాళ్ళకు ఆజ్ఞాపించాడు భూపతి.

ఒక్కొక్కరూ ఒక్కో చెట్టు యెక్కి, అక్కడ్నుంచి తాము జాగ్రత్తగా పరిశీలించిన పరిసరాల్ని గురించి, దిగువనవున్న భూపతికి చెప్పసాగారు.

అలా ఇంకో గంట గడిచింది.

భూపతికి పదిగజాల దూరంలో ఉన్న చెట్టెక్కిన ధోరమ్ చెట్టుమీంచి "దొరా!" అంటూ గట్టిగా కేక పెట్టాడు.

ధోరమ్‌కు సమీపంగా పరుగెత్తాడు.

"ఏం?...ఏమైన కనబడ్డదా?" అరిచాడు భూపతి.

చెట్టుమీంచి ధోరమ్, చేతులూపుతూ, ఓ దిక్కుకు వెళ్ళమంటూ సైగ చేసాడు.

భూపతి, తతిమ్మా మనుషుల్ని తీసుకుని, ధోరమ్ సూచించిన దిక్కుకు బయలుదేరాడు.

అక్కడో నాలుగైదు పిచ్చి తుప్పలున్నాయి. ఆ తరువాత ఓ వెదురుపొద ఉంది. చూపరులకు మామూల్గా, వెదురుపొద కవతల దగ్గరగా, దట్టంగా యెదిగిన వెదుళ్ళు తప్ప యింకేమీ లేవనిపిస్తుంది. కాని, నిజానికి ఆ వెదురు పొద మధ్య సుమారు ఇరవై చదరపు అడుగుల సమతల ప్రదేశం ఉంది.

వెదురుపొద మధ్యనుంచి యెలాగో చోటుచేసుకుని, లోనికెళ్ళిన భూపతి ఆ స్థలం చూసి ఆశ్చర్యచకితు డయ్యాడు.

ఆ ప్రదేశం పులితాలూకు డిన్నర్ టేబిలులా ఉంది. ఎందుకంటే, అక్కడ అంతటా ఎముకల పోగులున్నాయి. వాటి మధ్య గతరాత్రి భీందొర పశువుల కొట్టంలోంచి యెత్తుకొచ్చిన ఆవు కళేబరంకూడా ఉంది.

ఆవు తోక, కళేబరానికి నాలుగు అడుగుల దూరంలో పడివుంది. అంటే, తన డిన్నరు సిద్ధంచేసుకుని ఉంచుకుం దన్నమాట పులి. ఇహ కానివ్వడమే తరువాయి.

ఆహారం తీసుకోవడం విషయంలో పులి కొన్ని వేళలు పాటిస్తుంది. సాధారణంగా సాయంకాలం నాలుగుగంటల తర్వాత, మునిమాపువేళకు ముందుగా, తను దాచుకున్న తిండి దగ్గరకు విధిగా వస్తుంది. చాలా అరుదుగా, నాలుగు గంటలకు ముందు వస్తుంది. ఎటువంటి పరిస్థితుల్లోనూ, రాత్రి తొమ్మిది తర్వాత, తన ఆహారం దగ్గరకు రాదు.

వాచీ చూసుకున్నాడు భూపతి. రెండుంపావు ఐంది. పులి తన ఆహారందగ్గరకు వచ్చేవేళ సమీపిస్తోంది. తను తిరిగి, ఊళ్లోకి వెళ్ళి, భోంచేసి వెనక్కు రావడానికి, కావాల్సిన టైం లేదు.

పులి వచ్చే స్థలం కనుక్కోవడం జరిగింది. ఇహ పులి కోసం యెదురుచూసి, కాల్చి చంపడమే మిగిలి ఉంది.

మంచె కట్టుకుని, దానిమీద నుంచి పులిని చంపడం ఒక పద్ధతి. అలాగాకుండా, నేల యెత్తున, పులి రాబోయే స్థలానికి యిరవైగజాల దూరంలో, నేలమీదే కూచుని మాటుకాయడం యింకో పద్ధతి. రెండోదంటేనే,

భూపతికి చాలా యిష్టం.

పులి ఆవు కళేబరాన్ని దాచుకున్న ప్రాంతమంతా సర్వేచేసాడు భూపతి. చివరకు, ఆతని అవసరాలకు, అభీష్టాల కనుగుణంగా ఓ పొద కనిపించింది.

పొద మధ్యలో తాను విశాలంగా, విశ్రాంతిగా కూచోవడానికి వీలుగా బాగా అవుపించింది. కొద్ది మార్పులతో దాన్ని తన కనువైన స్థలంగా మార్చుకోవచ్చునను కున్నాడు.

"ఓ పలవల కర్ర, ఆకులూ, రెమ్మలూ ఉన్న కొన్ని కొమ్మలు కొట్టి, ఇలా పట్రండి" తన తోడువాళ్ళకు పని పురమాయించాడు భూపతి.

థోరబ్ ఓ పలవల కర్ర కొట్టి తెచ్చాడు. దాన్ని, తను కూచోబోయే స్థలంలో కుడిప్రక్కగా, భూమికి ఓ గజం యెత్తుకు వచ్చేలా పాతిపెట్టాడు భూపతి.

పులికోసం యెదురుచూస్తూ కూచున్నంత సేపూ, తుపాకీ చేతిలో పట్టుకూర్చుంటే, పులి వచ్చే సమయానికి, చేతులు పీకుతాయి, దానివల్ల తుపాకీగురి తప్పవచ్చు. అంచేత తుపాకీ ఆనించి ఉంచడానికి, చప్పున అందుకోవడానికీ వీలుగా ఉండడానికి, పలవలకర్ర 'రెస్ట్ బార్' గా పనికొస్తుంది.

ఆ తరువాత మిగతావాళ్ళు, నరికి తెచ్చిన కొమ్మల్ని, తను కూచునే స్థలంలో తను అగపడకుండా వుండడానికి, చుట్టూ, నేలలో పాతాడు.

తనతో తెచ్చిన రగ్గు నాలుగు మడతలు పెట్టి నేలమీద పెట్టాడు. వెనుక, హేవర్ సాక్ పడేసుకున్నాడు భూపతి. రెస్ట్ బార్ మీద, లోడ్ చేసిన తుపాకీ ఆన్చాడు.

"ఇహ, మీరు ఇళ్ళకు వెళ్ళండి" అన్నాడు తనతో వచ్చినవాళ్ళతో.

"అళ్ళని వెళ్ళనియ్యండి. నేనుంటాను బాబూ మీకు తోడుగా" అన్నాడు భీందొర.

"అడవిలో ఒంటరిగా ఉండడం నా కలవాటే దొరా!... రెండో మనిషి నాతో ఉంటే వేట సాగదు. నువ్వూ వెళ్ళిపో దొరా!"

"మీకేమైనా ప్రమాదం కలిగితే..."

"నాకేం భయంలేదు. రాత్రికి పులిని చంపి, తెల్లవారేక మీ కా సంతోషవార్త చెప్తాను ... వెళ్ళండి" నచ్చచెప్పాడు భూపతి.

అయిష్టంగానైతేనేం, భీందొర, ధొరమ్, మిగతా డొంకిరి మెట్ట కుర్రాళ్ళు ఇళ్ళకు మళ్ళారు.

నిశ్శబ్ద వాతావరణంలో, అడివిలో, భూపతి ఒక్కడూ మిగిలాడు.

10

ఆకుల సందుల్లోంచి,అవతల వెదురుపొదల్లో ఉన్న అవు కళేబరం అవుపిస్తోంది భూపతికి స్పష్టంగా.

పులి వచ్చి తన డిన్నర్ ఆరగించడం ఆరంభిస్తే, భూపతికి కనిపించక పోవడమంటూ ఉండదు.

భూపతి రిస్టువాచీ చూసుకొన్నాడు. భీందొర వగైరా తనతో వచ్చిన మనుషులు వెళ్ళిపోయి సుమారు గంట గడిచింది.

అంతవరకూ వాళ్ళు చేసిన శబ్దం అంతం కాగానే, అడవి ఒక్కసారిగా మేల్కొన్నట్టయింది.

అంతవరకూ మనుషులు చేసిన శబ్దాలు వింటూ నోరు మూసుకొన్నుచున్న జంతువులు, పక్షులు, పురుగులు తమ గళాలు విప్పాయి. తమ స్వతంత్రాన్ని చాటుతూ, ఏవేవో కూతలూ, అరుపులూ చెయ్యసాగాయి.

కొన్ని కోతులు కొమ్మలమీద గెంతుతూ కిచకిచలాడు తున్నాయి. మరికొన్ని నేలమీదకు దిగి, వెర్రి అల్లరి ఆరంభించాయి. ఏవో వింతపురుగులు విచిత్రమైన ధ్వనులు చేస్తున్నాయి. ఉండుండి, యెక్కడినించో అడవికోళ్ళు చేసే గోల వినిపిస్తోంది.

హఠాత్తుగా కణుచు అరుపు వినిపించింది. అది ఆనందంతో చేసిన అరుపు కాదు. భయంతో, భీతావహమై పెట్టిన కేక అది.

కణుచు ఆగలేదు. అలా అరుస్తూనే ఉంది. అంటే, దగ్గరలో ప్రమాదం పొంచివుంది, జాగ్రత్తగా ఉండండోహో అంటూ మిగతా జంతువులకు తెలియచేస్తూ కణుచు ఇస్తోంది సిగ్నలు.

కణుచు అరుపు, ఓ దుప్పి అందుకుంది.

పులి తనకు దగ్గరలోనే ఉందనీ, తన డిన్నరు టేబిలు వద్దకు రావడమే తరువాయి అనీ అర్థం చేసుకొన్నాడు భూపతి.

భూపతి ఊపిరి దియ్యడంకూడా నిలిపేసాడు. ఆ క్షణంలో, ఆ ప్రాంతంలో ఉన్న చెట్టూ, చేమా, రాయీ రప్పల్లో ఒక్కటిగా అయిపోయి నిశ్చలంగా కూచున్నాడు.

వాతావరణం లాగిపట్టుకున్న బాణంలా బిగువుగా ఉంది.

ఐదునిముషాలు గడిచింది. పావుగంట గడిచింది. అరగంట గడిచింది. కాని ఏ నిముషానైనా రావచ్చు నను కున్న పులి రాలేదు.

ఎందుచేత? తను ఇక్కడున్నట్టు పసిగట్టిందా?

పులి శ్రవణశక్తి అతి సునిశితమైంది. మనబూటులో వేలు ముడిచి వదిలినా చాలు, ఆ శబ్దం దానికి వినపడుతుంది. అంతే! ఒక్క అంగుళం ముందుకు వెయ్యదు కాలు.

తాము తెచ్చి దాచుకొన్న ఆహారం వద్దకు వచ్చేటప్పుడు పులులు ఎంతో నేర్పు, ఓర్పు ప్రదర్శించుతాయి. ఒక్కోసారి, రెండువందల గజాలు చుట్టూ తిరిగిగాని, అతి జాగ్రత్తగా, ప్రతి ఆకు కదలికనూ, ప్రతి గడ్డిపోచ ఊగటాన్నీ పరిశీలించి, ఎక్కడా ఏ ప్రమాదమూ పొంచి లేదని నిర్ధారించుకున్నాక గాని, తమ డిన్నరును సమీపించవు.

ఒక్కోసారి వాటి జాగ్రత్త చూస్తుంటే, పులుల్ని పిరికి జంతువులుగా పరిగణించాల్సి వస్తుందేమోనని అనిపిస్తుంది.

చీకటి పడింది. వెన్నెల వచ్చింది. వెదురుపొదలో ఉన్న ఆవు కళేబరం దగ్గరకు పులి రాలేదు.

నిముషాలు గడిచిపోతున్నాయి. ఏ క్షణానైనా పులి రావచ్చునన్నే తపన, ఇంకా రాలేదేం అన్న ఆరాటం, ఇహ ఇవాల్టికి రాదేమోనన్న ఆలోచన కలిగించిన నిరాశ, ఒక్కసారిగా కలిగాయి భూపతిలో.

అతని ఒంట్లోని రక్తం, తలకు ప్రాకుతున్నట్టుగా అనిపించింది.

మరుక్షణంలో పులి రావచ్చునేమో నన్న ఆలోచన, అకస్మాత్తుగా అతని చేతిని వేపుతోంది, తుపాకీ అందుకోమంటూ. కాని, అలాంటి అనుభూతి, అతనికి సామాన్యమేమో, తమాయించుకున్నాడు.

అడవి నిశ్శబ్దంగా అయిపోయింది.

అదే సమయంలో, అతని తొడను ఏదో పొడుస్తున్నట్టు అన్పించింది.

ఐతే, అదేమిటో తక్షణం చూడాలన్న కోరిక కలిగింది గాని, నిగ్రహించుకున్నాడు భూపతి.

ఇందాకటి పొడవడం పోయింది. ఐతే, తొడమీద బరువుగా, గరుగ్గా యేదో రాసుకుంటున్నట్టుగా అనిపించింది.

తల తిప్పినా, వేలు కదిపినా, అసలు తన శరీరంలో యేమాత్రం కదలిక చూపినా, పులి రాకుండా వెళ్ళిపోవడం ఖాయం.

అందుకే, అతను చెక్కిన శిల్పంలా నిశ్చలంగా కూచుండిపోయాడు.

ఐతే, అలాగని యేమీ చెయ్యకుండా ఊరుకో లేకపోయాడు. కనుగుడ్డు, మూలకంటా త్రిప్పి చూశాడు.

క్షణంపాటు అతని గుండె లయ తప్పింది.

భూపతి చూసింది, ఓ పెద్ద పాముని. అది సుమారు పది, పన్నెండడుగులుంటుంది. అతని తొడమీంచి, ఏదో బండమీంచి ప్రాకుతున్నట్టుగా ప్రాకుతోంది.

తన శరీరంలో యేమాత్రం కదలిక చూపకుండా, ఎంత తెలివిగా తను ప్రవర్తించాడో తలుచుకుని తనను తాను అభినందించుకున్నాడు మనసులో.

నిముషాలు యుగాలుగా, మన్వంతరాలుగా గడుస్తున్నాయి. పాము ప్రాకుతోంది. ఆ ప్రాకటానికి అంతు లేనట్లుగా ఉంది. ఉండుండి, మధ్యలో ఎందుకో ఆగిపోతోంది. కాసేపు కదిలి, మళ్ళా ఆగిపోతోంది.

వెదురుపొదలోకి పులి వస్తుంది, దాన్ని కొట్టాలి. అన్న

ఆలోచన భూపతి మనసులోంచి పూర్తిగా తుడిచిపెట్టుకు పోయింది.

ఐనా, వెదురు పొదమీదే దృష్టి నిలిపాడు, చేసేదేమీ లేక. అసలు అలా చెయ్యడమే ఆ క్షణంలో శ్రేయోదాయకం గనుక.

పాము కదిలి వెళ్ళిపోయింది. తొడమీది బరువు తగ్గింది. గుండె ఒక్కసారిగా తేలికబడింది.

కాని, గట్టిగా నిట్టూర్చడానికికూడా సావకాశంలేదు. ఎందుకంటే, పాము బెదిరి, చట్టున వెనుదిరిగి కరవ్వొచ్చు. లేదా రావాల్సిన పులి, ఆ మాత్రం సందడికే, రాకుండా వెనుదిరిగి పోవచ్చు.

క్షణాలు దొర్లిపోతున్నాయి. మళ్ళా, అడవిజంతువులు స్వేచ్ఛాగానాలు మొదలుపెట్టాయి.

అంటే, తనను తాను బయట పెట్టేసుకున్నాడు పులికి, అనుకున్నాడు భూపతి.

ఇహ, యీ రాత్రి వృథా అయినట్టే!

నడుం కొయ్యలా బిగుసుకుపోయినట్టుగా వుంది. ఒహటే పీకుతోంది. వెచ్చని పడకకోసం, మనస్సు ఉవ్విళ్ళూరుతోంది.

వెంటనే లేచి గ్రామం వెళ్ళిపోవాలనుకున్నాడు. కాని, తనకు త్రోవ అంతగా పరిచయంలేదు కాబట్టి, తప్పవచ్చు.

భూపతి ఆలోచన సింగిమీదకు మళ్ళాయి.

మొదట, ఆ రోజు రాత్రి అందరి మధ్యలో నిలబడి, సింగి నాట్యం చేసినపుడు, నిజంగానే సింగి అందాలు తన మగతనాన్ని రెచ్చగొట్టాయి. తనలో యువకత్వాన్ని మేల్కొల్పాయి. కాని, సడెన్‌గా, సింగి అంటే ఏహ్యత,

జుగుప్స యేర్పడలేదు గాని, మొదటిలా వాంఛించలేక పోతున్నాడు.

సింగి గురించి ఆలోచనలు అంత రుచికరంగాలేవు భూపతికి.

వెన్నెల్లో వెలిగిపోతున్న ప్రకృతిసుందరిని, నిశ్శబ్దంగా ఆరాధించే పనిలో లగ్నమయ్యాడు.

11

రాత్రి యెప్పుడు నిద్ర ముంచుకొచ్చిందో యేమో, పూర్తిగా తెల్లవారేసరికి, ఉన్నచోటనే కూచుని జోగుతున్నాడు భూపతి.

ఒకసారి గట్టిగా జోగి, ముందుకు పడబోయి, తమాయించుకున్నప్పుడు, మెలకువ వచ్చేసింది అతడికి.

కళ్ళు మండుతున్నాయి. ఒళ్ళంతా ఒహాటే సల్పుతోంది. గట్టిగా ఆవులించి, ఒళ్ళు విరుచుకుని, లేచి నిలబడ్డాడు. వెదురుపొదవైపుకు చూసాడు.

పులి తన ఆహారాన్ని ముట్టలేదు. ఆవు కళేబరం, ముందురోజు చూసిన విధంగానే పడివుంది.

అసలు రాత్రి, పులి ఆ పరిసరాలకు వచ్చిందా అన్న అనుమానం కలిగిం దతడికి.

పులి వచ్చివెళ్ళిన గుర్తుల్ని వెదుక్కుంటూ బయలుదేరాడు.

ఎంత జాగ్రత్తగా ఉన్నా, తన ఉనికిని పులి యెలా గ్రహించిందో అర్థంగాలేదు.

పులి తన ఆహారానికి సుమారు పదిహేను గజాల దూరంవరకూ వచ్చి, ప్రమాదం ఉందని ఎలాగో నిర్ధారించుకుని, తన ఆహారాన్ని ముట్టకుండా వెళ్ళిపోయింది.

ఇంచు మించు, పులి ఓ పెద్ద ప్రదక్షిణమే చేసింది. అది మొదట భూపతి ఉన్న దిక్కునుంచే వచ్చింది. భూపతి వెనుగ్గా పాతిక గజాల దూరంలోకి వచ్చింది. కుడిప్రక్కకు మళ్ళింది. అక్కడో అరగంటకుపైగా ఆగి వుంటుంది. ఆ తరువాత తిన్నగా, అంటే, భూపతికి ఎదురుగా, తన ఆహారానికి, పదిహేను గజాల దూరంలోకి వచ్చి ఆగింది. బహుశా, అక్కడో అరగంటో, గంటో ఆగి వుంటుంది. దాని అనుమానం నివృత్తి అయ్యుండదు. మరి కాస్త ఎగువకు వెళ్ళింది. అక్కడినించి, పులి అడవిలోకి వెళ్ళిపోయినట్టు, మట్టిలో గుర్తులున్నాయి. అంటే, అక్కడే దానికి భూపతి ఉనికి గురించి రూఢిగా తెలిసి వుంటుంది.

కానయితే, పులి యెలా గుర్తు పట్టింది, తను వున్నట్టు? ఎప్పటిలా అది శేషప్రశ్న అయి కూర్చుంది భూపతికి.

"బాబూ! భూపతి బాబూ!"

భీందొర కేక విన్పడ్డంతో భూపతి ఆలోచనలు ఆగిపోయాయి.

తనున్న చోటునుంచి గబగబా వెలికివచ్చి, గ్రామం నుంచి వచ్చిన భీందొర వగైరా మనుషుల్ని కలుసుకున్నాడు భూపతి.

"చచ్చిందా బాబూ!...ఆ రాక్షసి...ఏదీ?" అడిగారు ఆత్రంగా అందరూ.

సిగ్గుపడి, తల వంచుకుని, "లేదు... నేను వున్నట్టు అది పసిగట్టి రాకుండా పారిపోయింది" అని చెప్పి, పులి యెలా తన అపూర్వమైన తెలివితేటలు ప్రదర్శించి తనని తప్పించుకుందో గుర్తులు చూపి వర్ణించాడు భూపతి.

గ్రామస్తుల మనస్సుల్లో నిస్పృహ ఆవరించింది. భూపతి ఎన్ని చెప్పినా, ఆ భావం తొలగిపోలేదు.

'పట్రాడు ఇతనికేం తెలుసు పులివేట?' అన్న భావ ముద్ర కొందరి మొహాల్లో ఉంటే 'కబుర్లేగాని క్రియ శూన్యం' అన్న భావం మరి కొందరి మొహాల్లో ఉంది.

ఒక్క భీందొర మొహంలో మాత్రం, భూపతి సామర్థ్యంమీద సడలని విశ్వాసం ఉన్నట్టుగా ఫీలింగ్ ఉంది.

భూపతి బాగా అలసిపోయాడు. అప్పటికి ఉదయం ఎనిమిదిన్నరైంది.

వెంటనే గ్రామంవెళ్ళి, సుష్టుగా భోంచేసి, రెండు మూడు గంటలు నిద్రపోతేగాని, మధ్యాహ్నం మళ్ళా వేటకు రావడానికి టైం ఉండదనుకున్నాడు.

"ఇహ వెళ్దాం పదండి...బాగా అలసిపోయాను" అన్నాడు భూపతి బయల్దేరుతూ.

తతిమ్మావాళ్ళుకూడా, గ్రామంవైపు బయలుదేరారు.

12

పళ్లెం నిండుగా అన్నం, పైన మాంసంకూర పెట్టి, భోజనం తెచ్చింది సింగి.

అంతవరకూ చూపులతో నమిలేస్తోంది గాని, చేరువగా వచ్చే సాహసం చెయ్యలేదు. కారణం, అది పట్టపగలు అయ్యుండడమో, లేదా అదేపనిగా భీందొర వస్తూ, పోతూ ఉండడమో అయ్యుంటుంది.

ఏది ఏమైనా, భోజనం అయిపోయాక, తను పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి. అప్పుడుగాని, సాయంకాలం వేటకు వెళ్ళలేడు.

ఐతే, సింగిని దూరంగా వుంచేదెలా? భూపతి చకచకా ఆలోచించాడు.

ఏదో పనిమీద సింగి అవతలికి వెళ్ళడం జరిగితే, లోపల గడియలు పెట్టి, వీధిలో భీందొరను కాపలా పెడితే, తన ఉద్దేశం నెరవేరుతుంది.

భూపతి భోజనం ముగించాడు. సిగరెట్టు వెలిగించాడు.

నేలను కాళ్ళు అంటుకు పోయినట్టుగా, ఎదురుగానే నిలుచుని భూపతిని చూస్తోంది సింగి అంతసేపూ.

తను భోంచేసిన ప్రదేశంలో గిన్నెలు, పళ్లేలు, గ్లాసులు, నేలమీద జల్లబడ్డ మెతుకులతో అసహ్యంగా, చీదరగా ఉంది. వాటిని చూడగానే, సింగిని యెలా బయటికి పంపాలో ఐడియా వచ్చింది భూపతికి.

"ఈ గిన్నెలవీ అసహ్యంగా ఉన్నాయి. ఎత్తేసి, శుభ్రంచేసి రారాదూ, తీరిగ్గా మాటాడుకోవచ్చు" అన్నాడు భూపతి, పెదాలమీద తెచ్చిపెట్టుకొన్న నవ్వుతో, కళ్ళల్లో కొంటెతనం కన్పరుస్తూ.

అతని మాటల్లో ఆమె అంతవరకూ ఆశించని ప్రోత్సాహం అవుపించింది.

"అలాగే బాబూ!" సంబరపడిపోతూ బయటకు కదిలింది సింగి.

సింగి అలా వెళ్ళగానే, ఇలా భీందొర వచ్చాడక్కడికి.

"దొరా! లోపల గడియలుపెట్టి పడుకుంటాను. ఎవర్నీ లేపనీకు నన్ను. గుమ్మంలో కూచో" అన్నాడు భూపతి.

"అలాగే బాబూ!...హాయిగా పడుకోండి" అంటూ భీందొర వీధిలోకి వెళ్ళి కూచున్నాడు.

గబగబా సిగరెట్టు నాలుగుదమ్ములు పీల్చి, పీకని వీధిలోకి విసిరేసాడు. వెంటనే ఇంట్లోకి వచ్చి, గడియలు

బిగించి మంచంమీద వాలిపోయాడు.

శరీరం ప్రక్కకు తగలగానే, నిద్ర ముంచేసింది భూపతిని. కలలులేని కమ్మని గాఢనిద్ర పట్టింది అతడికి.

అలా చాలాసేపు నిద్ర పోయినట్టుగా గుర్తు అతడికి. కాని, అతడికి మెలకువవచ్చే సమయానికి తననెవరో కుదుపుతున్నట్టుగా అనిపించి కళ్ళు తెరిచి చూసాడు.

వెల్లకిలా పడున్న తన మొహానికి పైన చేరువగా సింగి మొహం కన్పించగానే, ఆశ్చర్యపోయాడు.

తన ఒంటిమీద బట్టలులేవు. సింగి సరేసరి. ఒంటిమీద ఒక్క నూలుపోగులేకుండా, భూపతిని నిలువునా ఆక్రమించి ఉంది. కండల్లాంటి ఆమె రొమ్ములు అతడి ఛాతీని అదిమేస్తున్నాయి కసిగా.

చట్టున లేచి కూచున్నాడు భూపతి.

ఆమె లోనకెలా వచ్చింది?

ఆమె అతడ్ని విడవలేదు. రెచ్చుతున్న కామంతో అతడ్ని అల్లుకో జూస్తోంది.

"భీందొర యేడీ?" అడిగాడు భూపతి, మొగుడి పేరెత్తితే, ఆమె స్పృహలోకి వచ్చి, మామ్మూలు కావచ్చునేమో అని.

"జీలుగు కల్లు తేవడానికి వెళ్ళాడు" చెప్పింది సింగి. ఆమెలో మార్పులేదు, భూపతి ఆశించినట్టుగా.

"బయట వుండమని చెప్పానే."

"ఆ సంగతి నాకు తెలుసు. అందుకే జీలుకు కల్లుకోసం అడివికి పంపాను. పడుచు పెళ్ళాన్ని ప్రక్కలో తృప్తి పరచకపోయినా, అడిగింది, తెచ్చయినా తృప్తిపరచాలి గదా!"

"లోపల గడియలు వేసానే...యెలా వచ్చావ్?"

"ఈ గడియలు ఎందుకూ పనికిరావు... శాస్త్ర బలం ఉపయోగిస్తే."

గడియలు విరగ్గొట్టి, దొడ్డివైపునించి లోనికి వచ్చింది సింగి అన్న విషయం అర్థమై, భూపతి గుండె గుభేలుమంది.

సింగిని సున్నితంగా ప్రక్కకు తోసి, మవునంగా లేచి, బట్టలు వేసుకోసాగాడు.

"రాత్రికే... అంటూ ఆశ పెట్టావు. రాత్రికి అడవిలోనే ఉండిపోతావన్న విషయం మర్చిపోయి నమ్మాను. ఇప్పుడు అవకాశం వచ్చినా తప్పించుకుంటున్నావేం?" అంది సింగి, ఇంకా నగ్నంగా భూపతి ప్రక్కమీద కూచుని, లేచి బట్టలు వేసుకునే ప్రయత్నం చెయ్యకుండా.

"లేదు. అప్పుడే రెండు కావస్తోంది. పులి వచ్చి ఆహారం తిని వెళ్ళిపోయిందంటే, దాన్ని చంపడం ఇంకా కష్టమై పోతుంది" అంటూ మరి సింగిని పట్టించుకోకుండా, అడవికి వెళ్ళడానికి సిద్ధం కాసాగాడు.

అదే సమయంలో, వీధి తలుపుమీద టకటకమన్న చప్పుడయ్యింది.

"ఎవరదీ?" గట్టిగా అన్నాడు భూపతి.

"నేను బాబూ! దొరని. వేళయినట్టుంది. లేపుదామని" అన్నాడు భీందొర అవతలి వైపునించి.

"ఇదిగో తయారుగానే ఉన్నాను" అని అన్నాడు గాని, తలుపులు తెరిచే ప్రయత్నం చేయ్యలేదు భూపతి.

పరిస్థితి చెయ్యి దాటిందని అర్థం చేసుకుంది సింగి. మాటాడకుండా లేచి, బట్టలు కట్టుకుని, దొడ్డి దోవగుండా వెళ్ళిపోయింది.

ఇబ్బంది, తొలగిపోయినందుకు గట్టిగా నిట్టూర్చి, తలుపులు తెరిచి భీందొరను లోనికి రమ్మన్నాడు భూపతి.

13

భూపతి యీసారి తను మాటు కాయాల్సిన జాగా మార్చాడు.

ముందరి రోజులానే, చెట్లకొమ్మలు నరికించి తను మాటు కాసే స్థలంలో, తన చుట్టూ కొన్ని, తన తలమీద కొన్ని, తను బయటపడకుండా, నేలలో పాతించాడు. గత రోజు ఉపయోగించిన పలవల కర్ర మార్చకుండా, రెస్ట్ బార్ గా, కొత్త జాగాలో పెట్టుకున్నాడు.

అన్ని యేర్పాట్లూ చేసి, భూపతి తన మాటులో కూచున్నాక, భూపతితో వచ్చిన మనుషులు గ్రామం తిరిగి వెళ్ళిపోయారు.

భూపతి తన చూపు వెదురుపొదలో వున్న ఆవు కళేబరం మీద నిల్పాడు.

నిముషాలు దొర్లిపోతున్నాయి.

భూపతి వాచీ చూసుకొన్నాడు. అయిదుగంటలు దాటి ఇరవై నిముషాలయింది.

'చారల దొరగారు ఇంకా డిన్నరుకు రాలేదేం. నిన్న ఉపవాసం చేసారు కూడాను'' అనుకున్నాడు భూపతి.

వాతావరణం ప్రశాంతంగా ఉంది. పురుగులు రొద, పక్షులు ఉండుండి వేసే కేకలు వాతావరణాన్ని ఆహ్లాదకరంగా చేస్తున్నాయి.

క్రూరమృగాల భయం ఉన్నా, రాక్షసులు పెట్టే బాధలకూ లోనుకావాల్సిన ప్రమాదం ఉన్నా, మునులు, ఋషులు, అడవుల్నే ఆశ్రయించి వుండేవారు అందుకే.

హఠాత్తుగా, అడవి ప్రశాంతతను భగ్నం చేస్తూ, ఓ అడవి పంది పెట్టిన కేక విన్పడింది.

ఏమేమో ఆలోచిస్తున్న భూపతి మెదడు చట్టున, నిగ్రహించుకుంది, తన ఆలోచనల్ని.

అదే సమయంలో, చెట్లమీది హనుమంతులు, అటూ ఇటూ కొమ్మలమీద అవిరామంగా గెంతుతూ, తమ ఆరాటాన్ని చాటుతున్నాయి.

అంటే, అడవి రాజుగారు, రంగంలోకి ప్రవేశించారు. ఇహ, ప్రదర్శన ఇవ్వడ మొక్కటే తరువాయి.

భూపతి నిశ్చలంగా కూచున్నాడు, రాతి బండల్లో రాతిబండలా, మానుల్లో మానులా.

ఊపిరి తీయడం కూడా అతి నిగ్రహంతో చేస్తున్నాడు.

ఈసారి, ఓ దుప్పి బేలగా అరవడం ఆరంభించింది.

పురుగులు, పక్షులు చేసే రొద ఆగిపోయింది.

ఒక్కసారిగా, కాలం ఆగిపోయినట్టుగా అయిపోయింది.

తుఫాను ముందరి ప్రశాంతత, ఘోరం జరిగేముందు నిశ్శబ్దం ఇలాగే ఉంటాయి కాబోలు అనుకున్నాడు భూపతి.

అతని గుండెల చప్పుడు అతనికే విచిత్రంగానూ, దుర్భరంగానూ విన్పిస్తోంది.

తన చూపు వెదురు పొదమీద నిలిపాడు.

ఏ క్షణాన్నైనా, పులి దర్శన మివ్వవచ్చు.

భూపతి నరాల్లో రక్తం ఒక్కసారిగా, అతని తలలోకి పరిగెడుతున్నట్టు అన్పించింది.

వన్యమృగాల్ని వేటాడ్డంలో చాలా పద్ధతులున్నాయి. బాజాలు మోగిస్తూ కొందరు పనివాళ్ళు, ఆయా జంతువుల స్థావరాల్లోంచి బయటకు తరిమి, షికారీకి ఎదురుగా

వచ్చేలా చేస్తారు. నేలకు ముప్పైఅడుగుల ఎత్తున ఓ మంచె కట్టుకుని, లేదా ఏనుగు అంబారీల్లో కూచుని, వచ్చిన జంతువుల్ని కాల్చి చంపుతారు.

చిన్నసైజు యుద్ధానికి చేసే భారీయెత్తు ఏర్పాట్లు జరుగుతాయి అలాంటి వేటలకు.

ఆ రకం వేటంటే, భూపతికి యిష్టం లేదు.

అడవి జంతువుల్ని, అవి తిరిగే ప్రదేశాల్ని కనిపెట్టి, మాటు కాసి, వాటిని కొట్టి చంపడంలో ఉన్న ఆనందం ఇంక దేనిలోనూ లేదు.

అకస్మాత్తుగా, భూపతి ఒళ్ళు మండుతున్నట్టుగా అనిపించింది.

ఏమైంది? తనను తాను ప్రశ్నించుకున్నాడు.

కారణం కనుక్కోవడానికి తనకు టైమూ, అవకాశమూ లేవు. ఆ ఫీలింగుని నిర్లక్ష్యంచేసి ఊరుకొన్నాడు.

రెండు క్షణాలు గడిచాక, మళ్ళా మండినట్టయింది, కాని, యీసారి మంట మంటలా లేదు. సూదులతో పొడుస్తున్నట్టుగా ఉంది.

కారణం కనుక్కోవాలన్న కోరిక బలంగానే కలిగింది కాని, తను యేమాత్రం కదిలినా, శబ్దంచేసినా, రంగం లోకి దిగిన చారల దొరగారు, దర్శనం ఇవ్వకుండానే వెళ్ళిపోతారు.

మంటను ఓర్చుకోవడానికి నిశ్చయించుకున్నాడు.

కాని, ఎంతోసేపు ఆ నిశ్చయం ఉండేటట్లు లేదు.

మంట క్షణక్షణానికీ యెక్కువ కాసాగింది. ఒళ్ళంతా వేలకొద్దీ సూదులు ఒకేసారి దింపినట్టుగా బాధ కలగ సాగింది.

పంటిక్రింద పెదవిని నొక్కిపట్టి, తన మనోబలం అంతా ఉపయోగించి, బాధను సహింపజూసాడు.

కాని, ఆ నొప్పి దుర్భరమైపోయింది. అప్రయత్నంగానే, అతని చేతులు కదిలి, తన బాధకు కారణమేమిటో కనుక్కోవడానికి ప్రయత్నించాయి.

ఓరి దేవుడా! ఎంత పని జరిగిపోయింది! తను తిన్నగా వచ్చి ఎర్రచీమల పుట్టమీద కూచున్నట్టుగా ఇందాకే తెలుసుకుని ఉండాల్సింది!

ఏంచెయ్యడం? ఊరుకుంటే, ఎర్రచీమలు తన ఒళ్లంతా కరిచి పారేస్తాయి.

మంట, నొప్పి, క్షణక్షణానికీ దుస్సహమైపోసాగింది.

డామిట్! ఇంకో రోజు వృధా అయింది! అనుకుంటూ, తన మాటులోంచి వెలుపలికి వచ్చాడు.

తన ఒంటిమీది బట్టల్ని గబగబా ఒకటి తర్వాత ఒకటి విడిచేసాడు.

నట్టడివిలో, పులికోసం వచ్చి, బర్త్ డే సూటులో నుంచోవడం తలుచుకుని విపరీతంగా నవ్వొచ్చింది భూపతికి.

ఒంటిని కరచి పట్టుకున్న చీమల్ని, చేతులతో పట్టుకుని పీకుతున్నాడు. కాళ్ళు నేలమీద తాటిస్తూ కొన్నిటిని దులిపేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

'అడివిలో కథాకళి' అనుకున్నాడు భూపతి, పూర్తిగా పులి గురించి మర్చిపోయి.

అదే సమయంలో 'లక్ లక్' మంటూ పెద్దగా శబ్దం కావడం ఆరంభించింది. తలెత్తి ఆ శబ్దానికి కారణమేమిటో పరిశీలించాడు.

పులి యెప్పుడు వచ్చిందో, యేమో, తన ఆహారం ఆర గింపు ఆరంభించింది.

రాస్కెల్! ఎంత తెలివైంది! తను దాన్ని కాల్చే పరిస్థితిలో లేడని గ్రహించి సాహసించింది.

నో! నో! లాభంలేదు! ఇంతటి గొప్ప అవకాశం మరి రాదు.

నాలుగడుగుల దూరంలో ఉన్న తుపాకీమీద దూకి అందుకుని, పులిని కాల్చిపారేయాలన్న కోరిక ఆపుకోలేక పోయాడు.

కాని ఆలోచించాడు.

ఆ విధంగా తొందరపడడంవల్ల, పులికి హుషారిచ్చి, తరిమేసిన వాడవుతాడుగాని, చంపడం జరగదు.

పులి, తన ఆహారాన్ని ఇప్పుడిప్పుడే తినడం ఆరంభించింది. అంటే, కాసేపు ఉంటుంది. తను యెప్పటిలా, దాన్ని గమనించనట్టుగానే ఉండాలి.

ఒంటిమీది చీమల్ని దులుపుకుంటూనే, మెల్లగా, తుపాకీ దగ్గరకు కదిలాడు భూపతి. కదిలినప్పుడు, తన చూపులు పొదలోని పులిమీదే నిలిపాడు.

అది, తిండి తినడంలో లీనమయింది.

భూపతి, తన తుపాకీ దగ్గరగా నిలుచున్నాడు. వంగి తీయడమే ఉంది.

ఇంకా, కొన్ని చీమలు భూపతి శరీరాన్ని పట్టివున్నాయి. అవి నిర్దాక్షిణ్యంగా కరిచేస్తున్నాయి.

అయితే, వాటిని పట్టించుకునే స్థితిలో లేడు భూపతి. మెల్లగా - ఎంతో మెల్లగా - చాలా మెల్లగా - వంగాడు. తుపాకీని అందుకున్నాడు అంతే మెల్లగా.

ఎంత మెల్లగా వంగాడో, అంతే మెల్లగా - ఎంతో మెల్లగా - పులిని తన డిన్నర్ నుంచి కంగారుపెట్టకుండా- తుపాకీ పట్టుకుని లేచి నిలుచున్నాడు.

చల్లగా తుపాకీని, పులివైపు గురిపెట్టాడు.

అవతల అవుపించిన దృశ్యం చూపి, భూపతి గుండెలు దిగులుతో బరువెక్కాయి.

పులి వెనుకభాగం తనవైపు ఉంది.

అంటే, తను కాలిస్తే, పులిని దెబ్బతీయగలడుగాని, చంపలేడు. ప్రాణాలు తోడేసే భాగాలన్నీ అటువైపే ఉన్నాయి.

చూడ్డానికి పులికి బెత్తెడు నుదురు ఉన్నట్టుగా ఉంటుంది. కాని, పులికి నుదురులేదు. దాని మెదడును కొట్టి చంపాలంటే, దానికి కళ్ళమధ్యగా గురిచూసి కొట్టడమే! దాని తరువాత చెప్పుకోవాల్సిన భాగాలు, పులి మెడ. మెడను భుజాన్ని కలిపే భాగం. ఈ భాగాల్లో కొడితే, పులి గుండె, ఊపిరితిత్తులు దెబ్బతిని పులి కచ్చితంగా చచ్చే అవకాశాలున్నాయి. ఇహ వెనుకవైపు కిడ్నీలు దెబ్బతినేలా కొడితే తప్ప, ఇంకెక్కడ కొట్టినా, పులికి దెబ్బ తగులుతుందిగాని చచ్చిపోదు.

తన అదృష్టం ఇలా పుచ్చిపోయిందేం? వేటలో వేటగా? సాహసం తెలివితేటలకు తోడు, కాస్త అదృష్టం కూడా వుండాలన్న విషయం పేరుమోసిన షికారీలు కూడా ఒప్పుకుంటారు.

అయినా, తను ఓర్మి, సహనం చూపాలి. వేటలో కావాల్సిన ప్రధాన గుణాలవే గదా!

అయిదు నిముషాలు గడిచాయి. పులికాస్త ప్రక్కకు తిరిగింది. దాని సైడుఫోజు అవుపిస్తోంది. చక్కగా, దాని

మెడ, భుజం భాగాలు అవుపిస్తున్నాయి.

జై జగన్మాతా! తమ ఇలవేలుపును తలుచుకుంటూ, ట్రిగ్గర్ నొక్కాడు. 'ఢాం' అన్న శబ్దం అడివి నిశ్శబ్దాన్ని తునాతునకలు చేసింది.

పులి వెనక్కి యెగిరిపడింది. నేలమీదపడి కొట్టు కుంటోంది బాధతో మూలుగుతూ.

మళ్ళీ ఇంకోసారి! జాగ్రత్తగా గురిచూసి కాల్చాడు. ఈసారి అది కొట్టుకోవడం ఆగిపోయింది. దాని బాధ అంతమైంది.

అయిదు నిముషాలు ఆగాడు. పులిలో చలనం లేదు.

అంటే, అది చనిపోయిందని నిర్ధారించుకున్నాడు.

మెల్లగా అడుగులేసుకుంటూ పోయి దాన్ని సమీ పించాడు. తోక పట్టుకుని చూసాడు. అది ఆడపులి!

పులి చచ్చిపోయింది! తను సాధించాడు!

సక్సెస్! సక్సెస్! గట్టిగా కేకలుపెడుతూ గెంతు లేసాడు భూపతి.

ఒక్కక్షణం పోయాక, తాను నగ్నంగా వున్నాడన్న విషయం గుర్తుకొచ్చింది. విప్పిపారేసిన బట్టల్ని, గట్టిగా దులిపి, తొడుక్కోసాగాడు.

"భూపతి బాబూ!" ఆ గొంతు భీందొరది.

భూపతి ఆశ్చర్యపోయాడు.

"ఇంటి కెళ్ళలేదా దొరా?" అడిగాడు భూపతి.

"లేదు బాబూ! ఇక్కడికి కాస్త దూరంలో చెట్టుక్కి కూర్చున్నాను. మీ వెంట ఉంటానంటే ఉండనివ్వరని అలా చేసాను. అఁ బాబూ! ఆ దొంగముండ చచ్చిందా" అన్నాడు భీందొర ఆత్రతగా.

"చచ్చింది దొరా! ఇదిగో" అంటూ ఆడపులి కళేబరాన్ని చూపాడు భూపతి.

"నాకు తెలుసు బాబూ! సాధిస్తారు. నాకు తెలుసు బాబూ!" అంటూ చెమర్చేకళ్ళతో, భూపతిని గట్టిగా కౌగలించుకున్నాడు భీందొర.

"ఒళ్ళంతా ఎర్రచీమలు కరిచేసాయి దొరా! ఒళ్ళంతా ఒకటే మంటగా వుంది" చెప్పాడు తన పరిస్థితి గురించి.

"పద బాబూ! విశ్రాంతి తీసుకుందురుగాని. పసరొకటి ఉంది రాస్తాను. తెల్లవారేసరికి అంతా పోతుంది"అన్నాడు భీందొర.

తన సామాన్లన్నీ భీందొరకు అందించి, భీందొర వెంట బయలుదేరాడు భూపతి.

వాళ్ళు డొంకిరిమెట్ట చేరుకునేసరికి, రాత్రి తొమ్మిది గంటలయింది. వెన్నెల పుచ్చపువ్వులా కాస్తుండడంవల్ల, అడవిలో నడక కష్టం కాలేదు వారికి.

14

"ఒరేయ్! రండర్రోయ్! మన భూపతి బాబు పులిని కొట్టేసి నాడర్రోయ్!" అంటూ కేకలుపెట్టాడు భీందొర, ఊర్లోకి వస్తూనే.

డొంకిరిమెట్ట జనం, భూపతి చుట్టూ చేరారు.

"మా ప్రాణాల్ని కాపాడారు బాబూ!"

"మా పశువుల్ని రక్షించారు బాబూ!"

"ఈ పుణ్యం మిమ్మల్ని కలకాలం కాపాడతాది బాబూ!"

అలా రకరకాలుగా కొందరు భూపతికి కృతజ్ఞతలు చెప్పుకుంటుంటే, మరికొందరు అతన్ని ఆశీర్వదించారు.

పులి చచ్చిన వార్త తెచ్చిన సందడి తగ్గడానికి, జనం ఇళ్ళకు వారు మళ్ళడానికి ఓ గంటపట్టింది.

అప్పటికి రాత్రి పదిగంటలు దాటి పదినిముషాలయ్యింది. భూపతి శరీరం అంతా దద్దుర్లు యెక్కిపోయి, యెర్రగా వాచింది.

అతడి బట్టలన్నీ విప్పించేసి, గాలీ వానా ఆకు పసరు తెచ్చి, ఒళ్ళంతా రుద్దాడు భీందొర తన చేతులతో.

పావుగంట గడిచేసరికి, ఒంటి నొప్పులు తగ్గాయి. సుఖంగా నిద్రపట్టింది భూపతికి.

భూపతి ఉదయం నిద్రలేచేసరికి, పదిమంది మనుషుల్ని తీసుకెళ్ళి పెద్దపులి కళేబరాన్ని ఊర్లోకి తీసుకొచ్చాడు భీందొర.

తమ బంధువుల్ని, పశువుల్ని పొట్టబెట్టుకున్న ఆ పులి చచ్చినందుకు ఆ ఊరి ప్రజలు దాని కళేబరం చుట్టూ గెంతులేస్తూ నాట్యం చేసారు.

తను చంపిన పెద్దపులిని ఒక్కసారి పగటి వెల్తురులో చూడాలనిపించింది భూపతికి.

జనం మధ్యలో పడివున్న పులి కళేబరం దగ్గరకు వెళ్ళి చూసాడు.

తను కాల్చిన గుళ్ళు రెండూ మెడలో నాలుగంగుళాల దూరంలో తగిలాయి పులికి.

తలకాయనుంచి, తోకవరకూ మూరతో కొలిచాడు. ఆరుమూరలుంది సుమారుగా. అంటే, తొమ్మిదడుగుల పొడవుందన్న మాట. బరువు తక్కువలో తక్కువ 400 పౌను లుండవచ్చు.

పులి బాగా ముసలిదైపోయింది. కండరాల్లో జవ తగ్గడంవల్లనే, చురుగ్గా, చలాకీగా పరుగెత్తే అడవి

జంతువుల్ని వేటాడే శక్తి లేక, పశువుల్ని, మనుషుల్ని తినడం మరిగింది.

దాని చర్మం అమ్మితే బజార్లో రెండువేలు సుమారు ధర పలుకుతుంది.

"దొరా!... నేను వచ్చినపని ఐపోయింది... దీని చర్మం తీసి నువ్వు బజార్లో అమ్ముకో. పెర్మిషన్ యిస్తున్నాను. పోయిన నీ ఆవుకు బదులు ఓ మంచి ఆవు కొనుక్కో..." అన్నాడు భూపతి, భీందొరను సమీపించి.

"అదేమిటి బాబూ! అలాగంటున్నారు మీరు?... మాకీ సాయం చేసినందుకు మీకే మేం సాయం చేయాలి" అన్నాడు భీందొర.

"లేదు దొరా!... మీ ఆతిథ్యం నాకెంతో ఆనందం కలిగించింది. ఈ రెండురోజులూ మీ రెంతో ప్రేమగా చూసుకొన్నారు నన్ను" అంటూ ఇంట్లోకి కదిలాడు, తిరుగు ప్రయాణానికి సిద్ధం కావడానికి.

"ఈ ఒక్క రోజు ఉండండి బాబూ! రేపు తెల్లార గానే బయలుదేరి వెళ్ళిపోదురుగాని" అన్నాడు భీందొర.

"లేదు దొరా! నేను వెళ్ళిపోవాలి. పట్నంలో నాకు చాలా పనులున్నాయి" అన్నాడు భూపతి.

"పనులకేముంది బాబూ! ఉంటూనే వుంటాయి. ఈ ఒక్కరాత్రి ఉండండి. రేపు వెళ్ళిపోదురుగాని" అన్నాడు భీందొర.

"లేదు దొరా! ఇక్కడ ఒక్క క్షణం ఆగడం పడదు" చెప్పేసాడు నిశ్చయంగా.

ఇహ భీందొర మాట్లాడలేకపోయాడు. "మీ ఇష్టం" అంటూ ఊరుకొన్నాడు.

15

డొంకిరిమెట్ట వచ్చిన క్షణంనుంచీ, ఏదో పని కల్పించు కుని తన యెదురుగా తిరుగాడిన సింగి, గడచిన రాత్రి నుండీ తనదగ్గరకు రాకపోవడం చాలా ఆశ్చర్యం కలిగించింది భూపతికి.

తనకి కావాల్సిన స్నానానికి నీళ్ళు తేవడం, ఫలహారం ఇవ్వడం వగైరా పనులన్నీ భీందొరే స్వయంగా చేసాడు.

ఒకటి రెండుసార్లు కిటికీలోంచి చూసిమాత్రం వెళ్ళిపోయింది సింగి.

తనకు ఎన్నో సేవలు చేసినందుకు కృతజ్ఞతలు చెప్పుకోవాలనుకున్నాడు. గాని, ఆమె అగపడలేదు.

ఆఖరుకు భూపతి బయలుదేరే సమయం ఆసన్నమైంది. సింగితో మాట్లాడనందుకు కాస్త వెలితిగా ఫీలయ్యాడు భూపతి.

అనంతగిరివరకూ తోడువచ్చి, అక్కడ బస్సు ఎక్కించడానికి, తనూ వస్తానన్నాడు భీందొర. తనకు త్రోవ తెలీదు. పైగా తనకు తోడు కావాలి.

భీందొర రాకను ఆనందంగా అంగీకరించాడు భూపతి.

ఎందుకో దిగులు. ఏదో వెలితి. వచ్చిన రోజునాటి ఉత్సాహం తనలో లేకపోయినందుకు ఆశ్చర్యపోయాడు భూపతి.

నిజానికి, విజయం పొందే వెళ్తున్నాడు. ఐనా, మనస్సెందుకిలా కల్లోలంగా ఉంది?

ధొరమ్, మరికొంతమంది డొంకిరిమెట్ట యువకులు, చాలాదూరం భూపతి వెంటవచ్చి సాగనంపారు.

భూపతి వాచి చూసుకొన్నాడు; తొమ్మిది దాటి ఇరవై నిముషాలైంది.

చెట్లకొమ్మలద్వారా తాము నడుస్తున్న త్రోవలో పడుతున్న సూర్యకాంతి, ముగ్గులు వేసినట్టుగా అవు పిస్తోంది.

భీందొర, భూపతి సామాను భుజాన్నేసుకుని నడు స్తున్నాడు. వెనకాల భూపతి హుషారుగా, తొందరగా అడుగులేస్తున్నాడు.

మధ్యాహ్నం రెండుగంటలకో బస్సు, అనంతగిరి వస్తుంది. అది పట్టుకుంటే, రాత్రికి తను విశాఖపట్నం చేరుకోగలడు.

మెల్లగా భూపతి ఆలోచనలు పట్నంలోని తనవాళ్ళ మీదకు, అక్కడి జీవితంవైపు మళ్ళాయి.

"బాబూ! భూపతి బాబూ!__" అది సింగి గొంతు. తన వెనుకనించి విన్పించింది.

తుళ్ళిపడి వెనక్కి తిరిగాడు భూపతి. భూపతి మెద డులో లెక్కలేనన్ని ప్రశ్నలు. భీందొరకూడా ఆగి వెనక్కి తిరిగాడు.

ఆమె ఇక్కడికెందుకిలా వచ్చింది? తనతో మాట్లాడ దల్చుకుంటే, అక్కడే గ్రామంలోనే యెందుకు మాట్లాడ లేదు? భర్త దగ్గరలో ఉండగా, ఇంత దూరంలో, అడ విలో తనని కలుసుకోవడమా?

"ఏం సింగీ? రాత్రినించి అవుపించనేలేదు. వచ్చే టప్పుడు చెప్పాలనుకున్నాను. నువ్వు అవుపించలేదు మరి" అన్నాడు భూపతి.

"పోనీలే బాబూ! మీకీ పళ్ళిద్దామని పిలిచాను" అంటూ ఆమె భూపతికి చేరువగా వచ్చింది.

ఆమె కుడిచేతిలో పళ్ళున్నాయి.

కృతజ్ఞత మెరిసే కళ్ళతో, ఆనందంతో, ఆమె అందించిన పళ్ళు అందుకొన్నాడు.

అదే సమయంలో జరగ్గూడనిది, భూపతి కలలోగూడా ఆశించనిది జరిగింది.

ఆ క్షణంవరకూ అతడు గమనించలేదు గాని, ఆమె తన వెనుకగా ఉంచిన ఎడమచెయ్యి త్రాచుపాములా లేచింది. ఆ చేతిలో తళతళమని మెరుస్తూ, ఓ బాకు ఉంది.

ఐతే, సింగి చేతిలోని యీ త్తినకత్తి యీ త్తినట్టే ఉంది. "అమ్మా!" అంటూ చావుకేక పెట్టి, నేలకొరిగింది. ఆమె వెనకాల, రక్తసిక్తమైన కత్తి చేతిలో పట్టుకుని భీందొర ఉన్నాడు.

భూపతి నిశ్చేష్టుడయ్యాడు.

"ఏమిటిది? అంతా అయోమయంగా ఉంది...ఎందుకీ రక్తపాతం?"

ఐదునిముషాల తర్వాత అడిగాడు భూపతి.

"బాబూ! ఇది యిలా జరగాల్సి ఉంది...అంతే జరిగింది."

అన్నాడు భీందొర, కత్తి పారవేసి, దిగులుగా తల వంచుకుని.

"కోరివచ్చిన ఆడదాన్ని మగవాడు తిరస్కరిస్తే, అంతకన్నా పెద్ద అవమానం ఉండదు ఆడదానికి మా తెగలో. ఆ పురుషుడు ఆమెకు తన శత్రువు లందరిలోకీ పెద్ద శత్రువు. ఆమె అలాంటి పురుషుడ్ని విధిగా సంహరించి తన కసి తీర్చుకుంటుంది. మా తెగలో యీ విషయం పురుషులందరికీ తెలుసు. ఓ విధంగా చెప్పాలంటే, కోరు

వున్న పురుషుడిద్వారా కోరిక తీర్చుకునే స్వాతంత్ర్యం మా తెగలో ఉంది ఆడవాళ్ళకు. మా పాటల్లో, మా కథల్లో, మా కబుర్లలో ఇదే విషయం పదేపదే చెప్ప బడింది. మీ కీ సంగతి తెలీదు. కారణం మీ సంప్రదాయం, ఆచారం వేరు. మిమ్మల్ని పొందాలని మూడుసార్లు ప్రయ త్నించింది సింగి. కాని లాభం లేకపోయింది. ఇక మిమ్మల్ని చంప జూస్తుందని నాకు తెలుసు. అందుకే మీ వెంట వచ్చాను ఇప్పుడు. గత రాత్రినుంచి మీ కేదైనా ప్రమాదం జరుగుతుందేమోనని వెయ్యికళ్ళతో కనిపెట్టి చూస్తూనే వున్నాను" అంటూ ముగించాడు.

"మరి, నువ్వామెను నన్ను చంపకుండా ఆపాల్సింది. ఆమెను చంపావు దేనికి?"

"బాబూ! మీకు తెలీదు. కోరికతో ఉన్న ఆడది ఆకలితో ఉన్న ఆడపులిలాంటిది అంటారు మాలో. ఇవాళ కాపోతే రేపు, రేపు కాపోతే ఎల్లుండి...ఏదో ఒక రోజున, ఎక్కడో అక్కడ, సింగి మిమ్మల్ని చంపడం ఖాయం. అంచేత, ఆమెను చంపేయడం మినహా ఇంకో మార్గం లేదు."

భూపతి గుండె దిగులుతో బరువెక్కింది. కొన్ని క్షణాలు అలాగే నిశ్చలంగా నిల్చుండిపోయాడు.

-: ఐ పో యిం ది :-